thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 158 | జగిత్యాల శనివారం 12 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## మంధాన మరో మైలురాయి..



11



.. వివరాలు 4లో

## ఓటర్ల జాబితా సవరణ ప్రముఖులకు ఈసీ నోటీసులు!

సమంత.. విజయ్ దేవరకొండ.. లక్ష్మణ్‌కు నోటీసులంటూ సమాచారం

- మహేశ్‌బాబు, రాజమౌళి, వెంకటేశ్ పేర్లూ జాబితాలో
- సైనా.. మిథాలీ.. గోపీచంద్‌కూ నోటీసులంటూ ప్రచారం
- వివరాల్లో వ్యత్యాసాలపై ధ్రువీకరణ ప్రక్రియ
- నోటీసుతో ఓటు హక్కు రద్దయినట్లు కాదన్న అధికారులు

## కొండా సురేఖకు మీనాక్షి ఫోన్!



- కాంగ్రెస్‌లో కీలక పరిణామం
- విభేదాలు పక్కనపెట్టి చురుగ్గా ఉండాలని సూచన
- తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురి చర్చ
- అసెంబ్లీకి సురేఖ గైర్హాజరుపై పార్టీలో చర్చ
- అధిష్ఠానం సూచనతోనే ఫోన్ చేసినట్లు సమాచారం

4

# చదువే తలరాతను మారుస్తుంది



### అందుకే విద్యాశాఖను నా దగ్గరే ఉంచుకున్నా
### పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం
### విద్యా బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాలన్నదే లక్ష్యం
### ప్రపంచంతో పోటీపడేలా విద్యా వ్యవస్థలో మార్పులు
### అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** "ఎంత ఆస్తి ఉన్నా చదువు లేకపోతే సామాజికంగా వెనుకబడిపోతాం. అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. విద్య ఒక్కటే మన తలరాతను మార్చగలదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలకు మేలు జరగాలన్న ఉద్దేశంతోనే విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నానని స్పష్టం చేశారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి లేరంటూ వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ.. అంతకుమించి ముఖ్యమంత్రిగా తానే ఆ శాఖను పర్యవేక్షిస్తున్నానని చెప్పారు. విద్యపై తనకున్న ప్రత్యేక ఆసక్తే ఆ శాఖను తన వద్ద ఉంచుకోవడానికి కారణమన్నారు. శాసనసభలో విద్యారంగంపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల విద్య, విద్యా వ్యవస్థ మిగతా 2 లో

## కులగణన ఒక 'ఎక్స్‌రే'!

- తెలంగాణ సర్వే దేశానికే ఆదర్శం
- జనగణనలో కులగణన తప్పనిసరి చేయాలి
- బీజేపీ వైఖరి సూటిగా చెప్పాలి
- బలహీన వర్గాలకు న్యాయం కులగణనతోనే
- దేశ సంపద సమాన పంపిణీకి ఇదే మార్గం
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేపట్టాలా? వద్దా? అనే విషయంలో బీజేపీ సభ్యులు సూటిగా తమ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు.

2





## ప్రపంచం కంటే రెండింతల వేగంతో
# బ్రిక్స్ వృద్ధి!

- ప్రపంచ జీడీపీలో 40 శాతానికి పైగా వాటా
- ప్రపంచ జనాభాలో సగం బ్రిక్స్ దేశాల్లోనే
- ఆవిష్కరణలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్న సభ్య దేశాలు
- వాణిజ్యం.. పెట్టుబడులు.. సాంకేతిక సహకారం పెరగాలి
- బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రధాని మోదీ

4



### విశ్వసనీయ వ్యాపార బంధాలే ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

పాత ఆర్థిక శక్తుల స్థానంలో కొత్త శక్తులు

బ్రిక్స్ వాటా పెరుగుతోందన్న పుతిన్

జీ-7 వాటా 29 శాతానికే పరిమితమైందని వ్యాఖ్య

4



## మూసీ ప్రాజెక్టుకు 'గ్రీన్' అడ్డంకులు!

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ నోటీసులు

అనుమతులను సవాల్ చేసిన రిటైర్డ్ ఇంజినీర్లు

55 కిలోమీటర్లకు 20 కిలోమీటర్లే అధ్యయనమంటూ అభ్యంతరం

తదుపరి విచారణ అక్టోబర్ 16కు వాయిదా

3

## 'తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు'!

- రేవంత్-పొంగులేటి కలిసి రాష్ట్రాన్ని దోచేస్తున్నారన్న కేటీఆర్
- భూ దందాలు.. కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని ఆరోపణ
- తెరవెనుక సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని విమర్శ
- 'భూభారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' అన్న హరీశ్
- పొంగులేటి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

2

"తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు" అన్న రీతిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెట్టాపట్టాలేసుకుని రాష్ట్రాన్ని దోచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.







## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

- మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి
- దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ
- జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఫిర్యాదు

2



# రైతులకు యాంత్రీకరణ పథకం

**నచ్చిన కంపెనీ పనిముట్లు కొనుగోలు చేసే స్వేచ్ఛ!**

**మండలిలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమాధానం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** రాష్ట్రంలో రైతులు తమ అవసరాలకు అనుగుణంగా తమకు నచ్చిన కంపెనీకి చెందిన వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలను కొనుగోలు చేసుకునే పూర్తి స్వేచ్ఛను కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం నూతన యాంత్రీకరణ విధానాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమగ్ర సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులను వాడుకోకుండా నిలిపివేసిన యాంత్రీకరణ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించిందని, రైతు భద్రత, యంత్రాల నాణ్యత విషయంలో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల తనిఖీల అనంతరమే నాణ్యమైన పరికరాలను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. యాంత్రీకరణ పథకం అమలు కోసం రూపొందించిన ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో అధికారులతో పాటు ఆదర్శ రైతులు, ఎఫ్‌పీఓల ప్రతినిధులను భాగస్వాములను చేశామని, 444 కంపెనీలు దరఖాస్తు చేసుకోగా నిర్దేశిత ప్రమాణాలు పాటించే సంస్థలనే ఎంపిక చేస్తున్నామని మంత్రి వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పథకం కోసం రూ.71 కోట్లు కేటాయించగా రూ.63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 పరికరాలను సరఫరా చేశామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.147.91 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందిస్తూ ఆ సొమ్మును నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నామని తెలిపారు. దీనికి తోడు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 3.50 లక్షల ఎకరాల ఆయిల్ పామ్ సాగును మరో 3 ఏళ్లలో 6 లక్షల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం ప్రపంచస్థాయి విదేశీ యంత్రాలను దిగుమతి చేసుకుని ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల వద్దే రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# చెరువుల హద్దులకు రక్షణ కవచం

**మత్స్యకారుల బతుకులకు భరోసా**

**ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడేది లేదు**

**శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతో పాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువుల పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, ఆక్రమణలను ఏమాత్రం సహించేది లేదని విస్పష్టం చేశారు. జలవనరుల సమర్థ నిర్వహణ, ఆక్రమణల నిరోధానికి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న తరహాలోనే అన్ని చెరువులకు 'పరిరక్షణ, నిర్వహణ కమిటీల' ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించామని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు, రెండో దశలో డిసెంబర్ 2027 నాటికి మిగిలిన 16 వేల ఎకరాలకు నీరందిస్తామన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ. 25.42 కోట్లు మాత్రమే కేటాయిస్తే, తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 310.68 కోట్లు విడుదల చేసి పనులను వేగవంతం చేసిందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ సహా పలువురు సభ్యుల సూచనల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా బియ్యం, గోధుమలు, చక్కెరతో పాటు కందిపప్పు, వంటనూనె వంటి మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, దీనిపై పడే ఆర్థిక భారాన్ని అధ్యయనం చేస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

# పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

**కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం**

**అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

# చదువే తలరాతను మారుస్తుంది

మొదటి పేజీ తరువాయి

పునర్నిర్మాణానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేలో చదువు లేకపోవడమే సామాజిక వెనుకబాటుతనానికి ప్రధాన కారణంగా గుర్తించినట్లు తెలిపారు. ఆస్తులు ఉన్నప్పటికీ విద్యకు దూరమైన కొన్ని సామాజిక వర్గాలు వెనుకబడిపోయాయని చెప్పారు. గతంలో గొర్రెలు, మేకల పెంపకం వంటి సంప్రదాయ వృత్తులకే పరిమితమైన కొన్ని వర్గాలు చదువుకు దూరమయ్యాయని పేర్కొన్నారు. పేదలు, దళిత వర్గాలు ఉన్నత స్థాయికి చేరుకోవడంలో విద్యే ప్రధాన కారణమని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన మార్గాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ప్రపంచంలో ఆర్థిక సరళీకరణ సంస్కరణల తర్వాత విద్యా వ్యవస్థలో భారీ మార్పులు వచ్చాయని సీఎం చెప్పారు. ప్రపంచ విద్యా విధానం ఇప్పుడు మనకు అందుబాటులో ఉందని, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తెలంగాణ విద్యా వ్యవస్థను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఎన్నో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు పునాదులు వేసిన పండిట్ నెహ్రూ అడుగుజాడల్లో నడుస్తూ.. ప్రస్తుత జెన్ జీతోపాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల భవిష్యత్తును తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో విద్యతోపాటు సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో లోటుపాట్లను సరిదిద్దేందుకు ఉమ్మడి రాష్ట్రంలో కూడా లేని విధంగా ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా తెలంగాణలో నూతన మార్గదర్శకాలు రూపొందించేందుకు కేశవరావు కమిటీని నియమించినట్లు చెప్పారు. విద్యారంగంలో ఆధునిక విధానాలను తీసుకొచ్చేందుకు కమిషన్ సభ్యులు అందించే సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలు స్వీకరించి దేశానికే ఆదర్శంగా నిలిచే అత్యుత్తమ విద్యా విధానాన్ని రూపొందించడమే లక్ష్యమని ప్రకటించారు. రాష్ట్రంలో మొత్తం 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, 1.57 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ఇందులో 24,966 ప్రభుత్వ పాఠశాలల్లో 19,79,614 మంది విద్యార్థులు చదువుతుండగా, 1,24,456 మంది ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో 444 ప్రభుత్వ ఇంటర్మీడియట్



కళాశాలలు ఉండగా వాటిలో సుమారు 1.95 లక్షల మంది విద్యార్థులు, 6,359 మంది లెక్చరర్లు ఉన్నట్లు తెలిపారు.

**30 మందికి ఒక టీచర్.. మన దగ్గర 17 మందికే ఒకరు**

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా తెలంగాణలో ప్రతి 17 మంది విద్యార్థులకే ఒక ఉపాధ్యాయుడు అందుబాటులో ఉన్నారని సీఎం వివరించారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7,857 మంది ఉపాధ్యాయులను మాత్రమే నియమించిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది వ్యవధిలోనే 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఎలాంటి అవినీతి, చిన్న విమర్శకు కూడా తావులేకుండా కేవలం 55 రోజుల్లోనే 10,600 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. ప్రతి గూడెంలో సింగిల్ టీచర్ స్కూల్ ఏర్పడిన పరిస్థితి ఉందని పేర్కొన్న సీఎం.. ప్రతి మూడు కిలోమీటర్ల పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల ఉండేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యతోపాటు విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించడంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. విద్యాశాఖకు బడ్జెట్ కేటాయింపులను ప్రభుత్వం క్రమంగా పెంచుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 6.53 శాతం కేటాయించగా, 2024--25లో 7 శాతానికి పైగా, 2025-26లో 8 శాతానికి పైగా ఖర్చు చేసినట్లు చెప్పారు. 2025-26లో విద్యకు రూ.23,729 కోట్లు, 2026-27లో రూ.27,663 కోట్లు కేటాయించినట్లు వివరించారు. భవిష్యత్తులో రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించడమే తన లక్ష్యమని ప్రకటించారు. గత మూడేళ్లలో విద్యాశాఖ కోసం రూ.7,554 కోట్లు అదనంగా ఖర్చు చేసినట్లు చెప్పారు. 2023-24లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యకు రూ.18,955 కోట్లు కేటాయించగా, తమ ప్రభుత్వం 2025-26లో రూ.23,729 కోట్లు, 2026-27లో రూ.27,663 కోట్లు కేటాయించిందని వివరించారు.

**'మంత్రి లేరంటున్నారు.. నేనే పర్యవేక్షిస్తున్నా'**

విద్యాశాఖపై తాను సమీక్ష నిర్వహిస్తే 'విద్యాశాఖ మంత్రి సమీక్ష' అని కాకుండా 'సీఎం సమీక్ష' అని అంటున్నారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేరని కొందరు విమర్శిస్తున్నారని, కానీ ముఖ్యమంత్రిగా తానే విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. "విద్యాశాఖపై నాకున్న ఆసక్తితోనే దానిని నా దగ్గర ఉంచుకున్నా. పేదలకు మేలు జరగాలన్నదే నా ఉద్దేశం" అని స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో ప్రతి జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం తీసుకొచ్చిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. విద్యారంగంలో చేపట్టాల్సిన మరిన్ని సంస్కరణలపై నిర్వహించిన సర్వే ద్వారా కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. అసెంబ్లీలో సభ్యులు ఇచ్చిన విలువైన సూచనలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. విద్యను మరింత ఆధునికంగా, నాణ్యంగా తీర్చిదిద్ది ప్రపంచస్థాయిలో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా చర్యలు తీసుకుంటామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కులగణన ఒక 'ఎక్స్‌రే'!

**తెలంగాణ సర్వే దేశానికే ఆదర్శం**

**జనగణనలో కులగణన తప్పనిసరి చేయాలి**

**బీజేపీ వైఖరి సూటిగా చెప్పాలి**

**బలహీన వర్గాలకు న్యాయం కులగణనతోనే**

**దేశ సంపద సమాన పంపిణీకి ఇదే మార్గం**

**అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేపట్టాలా? వద్దా? అనే విషయంలో బీజేపీ సభ్యులు సూటిగా తమ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేను దేశానికి ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు. అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో భట్టి మాట్లాడుతూ.. కులగణన అనేది ఏదో ఒక కులానికో, రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రత, స్వభావాన్ని గుర్తించాలని, అందుకు కులగణన కీలకమన్నారు.

**తెలంగాణ సర్వేలో సమగ్ర సమాచారం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది? వారి వృత్తులేమిటి? ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? ఎంతమంది చదువుకున్నారు? ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు? నిరుద్యోగులు ఎంతమంది? భూమి ఉన్నవారు, లేనివారు ఎంతమంది? వంటి అనేక అంశాలపై కూలంకషంగా సమాచారం సేకరించినట్లు వివరించారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రిగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించినట్లు చెప్పారు. తెలంగాణలో చేపట్టిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని, నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు.

**దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి**

తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతోపాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు సైతం కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. కేంద్రం నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించినట్లు చెప్పారు. జనగణన సమయంలోనే కులగణనను కూడా చేపడతామని కేంద్రం గతంలో చెప్పిందని, ఇప్పుడు దానిని చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. "కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి. అనుకూలమైతే సభ తరపున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి పిలుపునివ్వాలి. వ్యతిరేకమైతే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి" అని భట్టి అన్నారు. తెలంగాణలో సర్వే జరిగిన విషయాన్ని అసెంబ్లీలోనే అభినందించి ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరికాదన్నారు.

**'అసమానతలను గుర్తించే ఎక్స్‌రే'**

సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. అసమానతలను తొలగించాలంటే సమస్య ఎక్కడుందో ముందుగా గుర్తించాల్సిందేనన్నారు. "సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన" అని అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభాతోపాటు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని చెప్పారు. ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకునేందుకు కులగణన ఉపయోగపడుతుందని వివరించారు.


**'రాహుల్ ప్రధాని అవుతారు'**

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ నాయకత్వంలో తెలంగాణలో నిర్వహించిన తరహాలోనే దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ సర్వే ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను గుర్తించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు, వనరులు, అవకాశాలు, ఆస్తులు అందరికీ న్యాయంగా, సమానంగా చేరేలా విధానాలను అమలు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# బీసీల జనాభా లెక్కలు తేల్చాలి

**కులగణన చేపట్టాలి: కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** దేశవ్యాప్తంగా బిసిల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు డ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభలో కులగణనపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, దశాబ్దాల పోరాట ఫలితమని స్పష్టం చేశారు. 1953



కాకా కాలేల్కర్ కమిషన్, 1979 బి.పి. మండల్ కమిషన్ రికార్డులు, 1990 ఓబీసీ 27 శాతం రిజర్వేషన్లు, 1992 ఇంద్రా సాహ్నీ కేసు మార్గదర్శకాలు, 2018 నాటి 102వ రాజ్యాంగ సవరణల ప్రస్తావన తెస్తూ జస్టిస్ రోహిణి కమిషన్ తరహాలోనే సరైన డేటా లభించాలంటే కులగణన అత్యంత కీలకమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన "జితనీ ఆబాదీ.. ఉత్నా హక్" నినాద స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. అనంతరం శాసనసభలో సభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ రావు, వీర్లపల్లి శంకరయ్యలు అడిగిన ప్రశ్నలకు పశు సంవర్ధక శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి 2024-25లో 59.35 లక్షల టన్నులు, 2025-26లో 61.75 లక్షల టన్నులకు పెరిగిందని, 2026-27 తొలి ఆరు నెలల్లో 30 లక్షల టన్నుల ఉత్పత్తి అంచనా ఉందన్నారు. పాడి రైతులకు మద్దతుగా 2026 ఆగస్టు 16 నుంచి గేదె పాలకు ప్రతి కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు రూ.340 ధర ఖరారు చేశామని తెలిపారు. మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ప్ (రాజు-రా) భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం అందిస్తున్నామని, పశుసంవర్ధక శాఖలో 1100 మందికి పైగా ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించామని వివరించారు. కర్ణాటక 'నందిని డెయిరీ' కంటే తెలంగాణలోని 'విజయ డెయిరీ' ద్వారా పాడి రైతులకు ఎక్కువ ధర చెల్లిస్తూ విజయాన్ని సాధిస్తున్నామని స్పష్టం చేశారు.

చురకలు



# ‘తమ్ముడు.. లెట్స్ దూ కుమ్ముడు’!

- రేవంత్-పొంగులేటి కలిసి రాష్ట్రాన్ని దోచేస్తున్నారన్న కేటీఆర్
- భూ దందాలు.. కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని ఆరోపణ
- తెరవెనుక సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని విమర్శ
- ‘భూభారతి’ పేరుతో ప్రజల భూములకు ‘భూ హారతి’ అన్న హరీశ్
- పొంగులేటి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 11:** “తమ్ముడు.. లెట్స్ దూ కుమ్ముడు” అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెట్టాపట్టాలేసుకుని రాష్ట్రాన్ని దోచేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు 22ఏ జాబితా పేరుతో సామాన్యుల భూములను ఇబ్బందుల్లోకి నెట్టారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపిస్తూ.. నైతిక బాధ్యత వహించి మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్.. “కొండల్, తొండల్, అనకొండల్” అంటూ రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి విమర్శలు చేశారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. ఫైళ్లు ఎవరి ఆదేశాలతో కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందన్నారు.

### ‘10 వేల ఎకరాలపై కన్నేశారు’

లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టేందుకు గిరిజనుల పొలాలను గుంజుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ చుట్టుపక్కల వేల కోట్ల రూపాయల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్‌రెడ్డి కన్నేశారని విమర్శించారు. మూసీ ముసుగులో, ఫ్యూచర్ సిటీ పేరుతో పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ దందాకు తెరలేపారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీని తీసుకొచ్చి ఆ ప్రాంత రూపురేఖలు మార్చితే.. ప్రస్తుతం రూ.200 కోట్ల విలువైన భూమిని రేవంత్ సోదరుడికి చెందిన కంపెనీకి కేవలం రూ.7 కోట్లకే “అడ్డికి పావుశేరు” లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ.1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత 22ఏ జాబితాలో పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు.

### ‘భూమి కనిపిస్తే బుక్కపెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్’

తెలంగాణ ఏర్పడకముందు రియల్ ఎస్టేట్ రంగానికి సరైన భరోసా లేదని, కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ పేర్కొన్నారు. ఒకప్పుడు ఎకరం రూ.5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ.50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకొచ్చారని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మాత్రం “భూమి కనిపిస్తే బుక్కపెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్” అన్న చందంగా దందాలు సాగుతున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న నేతలు గజదొంగల్లా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, ఇప్పుడు ‘భూభారతి’ పేరుతో భూముల గోల్‌మాల్ యథేచ్ఛగా సాగుతోందని ఆరోపించారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరఫున బీఆర్‌ఎస్ న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

### ‘భూభారతి కాదు.. భూ హారతి’

22ఏ వివాదంపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన దుర్మార్గమని ఆరోపించారు. “భూభారతి పేరుతో ప్రజల భూములకు భూ హారతి పడుతున్నారు” అంటూ ఎద్దేవా చేశారు. సీఎం ప్రజాపాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేసిందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, బాధితులు నేరుగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా న్యాయం జరగడం లేదన్నారు.

### ‘పేదల ఇళ్లకే హైడ్రా ప్రతాపమా?’

హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం.. బడాబాబులు నిర్మించిన భారీ అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి నివాసాన్ని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నారని పేర్కొంటూ.. అదే జాబితాలో చిక్కుకుని నానా ఇబ్బందులు పడుతున్న సామాన్యుల భూములు, ఇళ్లను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. పేదల ఆస్తులను తక్షణమే 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ ముందుండి రాజీలేని పోరాటం చేస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

- మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారు
- తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ
- జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:** తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని ‘శిఖండి రాజకీయాలు’ చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఏ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

### ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు

### కేసులో నలుగురు నిందితులను అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు





బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.



# కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాజీ మంత్రి కొండా సురేఖకు స్వయంగా ఫోన్ చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం. రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఫోన్ సంభాషణ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులతోపాటు కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో తలెత్తిన కొన్ని వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొనాలని మీనాక్షి నటరాజన్ సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జరుగుతున్న ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు సురేఖ హాజరుకాకపోవడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు మీనాక్షి నటరాజన్ స్వయంగా రంగంలోకి దిగి కొండా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో మళ్లీ క్రియాశీలంగా వ్యవహరించాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో రానున్న రోజుల్లో కొండా సురేఖ రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# మూసీ ప్రాజెక్టుకు ‘గ్రీన్’ అడ్డంకులు!

### రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ నోటీసులు

### పర్యావరణ అనుమతులను సవాల్ చేసిన రిటైర్డ్ ఇంజినీర్లు

### 55 కిలోమీటర్లకు 20 కిలోమీటర్లే అధ్యయనమంటూ అభ్యంతరం

### ఉస్మాన్‌సాగర్.. హిమాయత్‌సాగర్ నిర్మాణాలపైనా ప్రశ్నలు

### తదుపరి విచారణ అక్టోబర్ 16కు వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ కొందరు రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని ‘నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్’ (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ట్రిబ్యునల్, ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి అధికారికంగా నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించిన పర్యావరణ నిబంధనలు మరియు అనుమతుల్లో స్పష్టమైన లోపాలు ఉన్నాయని పిటిషనర్లు తమ పిటిషన్‌లో ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటే, కేవలం 20 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే అధ్యయనం చేయడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇదే ప్రాంతంలో ప్రముఖ ‘మృగవాణి జాతీయ పార్కు’ కూడా ఉన్న విషయాన్ని వారు ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువచ్చారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిసర ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై రిటైర్డ్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వాణిజ్య సముదాయాల ఏర్పాటు నిర్ణయం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని వాదించారు. ఈ ప్రాజెక్టు వల్ల భవిష్యత్తులో పర్యావరణంపై పడే దుష్ప్రభావాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు స్పష్టం చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ కొద్దికాలం క్రితం న్యాయపరమైన వివాదాలు నడిచినా, ఇప్పుడు తాజా పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం రాజకీయంగా కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ

### సెప్టెంబర్ 17 నుంచి ‘సేవా సంకల్ప్ అభియాన్’

### 17న ప్రతి ఇంటా ‘ఆశీర్వాద్ కా దియా’ పేరిట దీపాల వెలుగులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ‘సేవా సంకల్ప్ అభియాన్’ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వి. రాంచందర్ రావు వెల్లడించారు. పార్టీ శ్రేణుల్లో సేవా భావాన్ని నింపడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత దగ్గర చేయడమే ఈ నెల రోజుల ప్రచార కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. అభియాన్ ప్రారంభ రోజైన సెప్టెంబర్ 17న ‘ఆశీర్వాద్ కా దియా’ పేరిట ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలుపాలని ప్రజలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నెల రోజుల వ్యవధిలో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలు, ‘స్వచ్ఛ భారత్’ పారిశుధ్య డ్రైవ్‌లతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జన్‌ధన్ యోజన, డీబీటీ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల వంటి చారిత్రాత్మక పథకాలతో పేదలు, చేతివృత్తిదారులకు కలిగిన లబ్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ క్రమంలో ‘మేరే సప్నో కా భారత్’, ‘సేవా కీ కహానీ’, ‘సేవా జ్యోతి కలశ్ యాత్ర’, ‘సుశాసన సేవా సంవాద్’ వంటి సామాజిక-సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రధాని మోదీ సుపరిపాలన సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేస్తామని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## సంపాదకీయం



# మొహం చాటేసిన వర్షాలు

### రైతన్న గుండెల్లో గుబులు!

### వానాకాలం ముగుస్తున్నా తీరని వర్షాభావం

**వానాకాలం ముగింపు దశకు చేరుతున్నా వరుణుడు కరుణించడం లేదు. అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు మినహా ఆశించిన స్థాయిలో వానలు లేక రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయన్న అంచనాలు, పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్‌నినో' ప్రభావం రబీ పంటల భవిష్యత్తుపై మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ సహా పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైనట్లు వివరాలు చెబుతున్నాయి. దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గతేడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది ఇదే సమయంలో 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా ప్రస్తుతం 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైనట్లు సమాచారం. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి కొరత రబీ సాగుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే రబీ సీజన్‌లో నేలలో తేమ అత్యంత కీలకం. ముఖ్యంగా గోధుమ, ఆవాలు, శనగ పంటలకు నీటి లభ్యత, భూమిలో తేమ అవసరం. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానాలో గోధుమలు, ఆవాల సాగుకు తొలి తడికి రిజర్వాయర్ల నీరే ప్రధాన ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో శనగ పంట ఎక్కువగా భూమిలోని తేమపైనే ఆధారపడుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది.**

ఎల్‌నినో వల్ల ఏర్పడే ప్రతికూల పరిస్థితులను 'ఇండియన్ ఓషన్ డైపోల్' కొంతవరకు తగ్గించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే సానుకూల మార్పులతో భారత్ వైపు వర్షపు మేఘాలు వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్‌నినో తీవ్రతను ఈ ప్రభావం కొంతవరకు తగ్గించినట్లు పేర్కొంటున్నారు. అయితే ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమయ్యే అవకాశం ఉండటంతో ఇప్పటికే తగ్గిపోయిన భూగర్భ జలాలు, రిజర్వాయర్లను ఎంతవరకు నింపగలదన్న సందేహాలున్నాయి. అక్టోబర్, నవంబర్‌లోనూ భూమిలో తేమ పెరగకపోతే రబీ సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. ఫలితంగా గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరాపై ప్రభావం పడి నిత్యావసర ధరలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోనూ వర్షాభావ పరిస్థితులు రైతులను కలవరపెడుతున్నాయి. వర్షాధార పంటల సాగు తగ్గగా, బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరిని కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి. పంటలు ఎండిపోతుండటంతో బావుల్లో పూడిక తీయించడం, కొత్త బోర్లు వేయించడం చేస్తున్నా కొన్నిచోట్ల నీరు లభించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో వారం, పదిరోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగితే పంటలపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల్లో సాగు నమోదవుతుండగా ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు, అంటే సుమారు 92 శాతానికే పరిమితమైనట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. సాధారణంగా 66 లక్షల ఎకరాల్లో నమోదయ్యే వరి సాగు ఈసారి 52.81 లక్షల ఎకరాలు, అంటే 80 శాతానికే పరిమితమైంది. అధికంగా నీటిపై ఆధారపడే వరి సాగు దాదాపు 20 శాతం తగ్గింది. మరోవైపు 47 లక్షల ఎకరాల అంచనాకు గాను పత్తి 48 లక్షల ఎకరాల్లో సాగైంది. అపరాల సాగు 6.49 లక్షల ఎకరాల అంచనాను దాటి 7.86 లక్షల ఎకరాలకు చేరింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 49 రోజులే వర్షం కురిసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మిల్లీమీటర్లే నమోదై మొత్తంగా 20 శాతం లోటు ఏర్పడింది. 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన 18 జిల్లాల్లో లోటు కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరినాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ప్రస్తుతం 7.87 మీటర్లకు పడిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గగా, నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్ల మేర మరింత లోతుకు వెళ్లినట్లు సమాచారం. వర్షాలు లేక, సాగునీరు అందక రైతులు చెరువుల్లో మిగిలిన కొద్దిపాటి నీటినీ మోటార్లతో తోడుకుంటున్నారు. వనపర్తి జిల్లా పెద్దగండ్ల మండలం పుల్గర్ల గ్రామంలోని కొత్త చెరువు పరిధిలో సాధారణంగా 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతుండగా, ఈసారి నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడ సుమారు ఐదు ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు బీళ్లుగా మారాయి. ఆయకట్టు చివరనున్న పంటలకు నీరందించేందుకు చెరువులో మిగిలిన కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే వర్షాభావ పరిస్థితి కొనసాగితే రబీ పంటలకే కాదు.. భూగర్భ జలాలు మరింత దిగజారి వచ్చే రోజుల్లో సాగునీటితోపాటు తాగునీటికీ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాన కోసం ఆకాశం వైపు చూస్తున్న అన్నదాతకు ఇప్పుడు ప్రతి రోజూ కీలకంగానే మారుతోంది.

# ప్రపంచం కంటే రెండింతల వేగంతో 'బ్రిక్స్' వృద్ధి!

- ప్రపంచ జీడీపీలో 40 శాతానికి పైగా వాటా
- ప్రపంచ జనాభాలో సగం బ్రిక్స్ దేశాల్లోనే
- ఆవిష్కరణలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్న సభ్య దేశాలు
- వాణిజ్యం.. పెట్టుబడులు.. సాంకేతిక సహకారం పెరగాలి
- బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (చురకలు):** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం శరవేగంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధితో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఉమ్మడి ఆర్థిక వ్యవస్థ దాదాపు రెండింతల వేగంతో పురోగమిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో మోదీ ప్రసంగించారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయని మోదీ తెలిపారు. గత కొన్నేళ్లలో ప్రపంచ జీడీపీ సుమారు రెండున్నర రెట్లు పెరగగా, అదే సమయంలో బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ దాదాపు నాలుగున్నర రెట్లు విస్తరించిందన్నారు. ప్రపంచంలోని మిగిలిన దేశాలతో పోలిస్తే బ్రిక్స్ ఆర్థిక బలం దాదాపు రెండింతల వేగంతో పురోగమించిందని చెప్పారు. బ్రిక్స్ దేశాలు ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, పరిష్కారాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని మోదీ పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి ప్రజాప్రయోజన కార్యక్రమాల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు విస్తృతంగా కొత్త ఆవిష్కరణలకు అవకాశాలు రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. సాంకేతికత, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలకు సభ్య దేశాల్లో పెరుగుతున్న ప్రాధాన్యం వాటి భవిష్యత్ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. బ్రిక్స్ దేశాల్లో పెరుగుతున్న స్థాయి, వేగం, ఆశావాదం స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో సభ్య దేశాల మధ్య సహకారం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వేదికగా జరుగుతున్న ఈ సమావేశం ఇప్పటివరకు నిర్వహించిన వాటిలో అతిపెద్ద బిజినెస్ ఫోరమ్ అని చెప్పారు. వివిధ దేశాల వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఒకే వేదికపైకి రావడం కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని మోదీ పేర్కొన్నారు.



### మోదీ-పుతిన్ భేటీ.. ద్వైపాక్షిక బంధాలపై సమీక్ష

న్యూఢిల్లీలో భారత అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధనం, అంతరిక్షం, నైపుణ్య చలనశీలత, ప్రజా సంబంధాలు తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య జరుగుతున్న పురోగతిని ఇద్దరు నేతలు సమీక్షించారు. 2026లో భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్‌తోపాటు వివిధ అంతర్జాతీయ, బహుళపక్ష వేదికల్లో భారత్--రష్యా భాగస్వామ్యంపైనా అభిప్రాయాలను పంచుకున్నారు. పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణల కారణంగా సముద్ర వర్తకం, భారతీయ నావికుల భద్రతపై పడుతున్న ప్రభావం కూడా చర్చకు వచ్చింది. వివాదాల పరిష్కారానికి దౌత్యం, చర్చలే సరైన మార్గమని మోదీ పునరుద్ఘాటించారు. శాంతి స్థాపన ప్రయత్నాలకు సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ బలంగా నిలిచిన భారత్-రష్యా 'ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని ఇరు నేతలు అంగీకరించారు.

### విశ్వసనీయ వ్యాపార బంధాలే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక : పుతిన్

బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు, వ్యాపార భాగస్వామ్యాల ప్రాధాన్యాన్ని వివరించారు. పరస్పర నమ్మకంతో కూడిన వ్యాపార సంబంధాలు, ఆర్థిక భాగస్వామ్యాలే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడంతోపాటు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ఇవి కీలకమన్నారు. గతంలో ప్రపంచ ఆర్థిక వృద్ధికి నాయకత్వం వహించిన పాత ఆర్థిక శక్తుల స్థానంలోకి కొత్త ఆర్థిక శక్తులు వస్తున్నాయని, ఇది సహజమైన మార్పని పుతిన్ వ్యాఖ్యానించారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా గత ఐదేళ్లలో 40 శాతానికి పైగా ఉండగా, జీ-7 దేశాల వాటా 29 శాతానికే పరిమితమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తోపాటు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, ఇతర భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సవరణ ప్రముఖులకు ఈసీ నోటీసులు!

### సమంత.. విజయ్ దేవరకొండ.. లక్ష్మణ్‌కు నోటీసులంటూ సమాచారం
### మహేశ్‌బాబు, రాజమౌళి, వెంకటేశ్ పేర్లూ జాబితాలో
### సైనా.. మిథాలీ.. గోపీచంద్‌కూ నోటీసులంటూ ప్రచారం
### వివరాల్లో వ్యత్యాసాలపై ధ్రువీకరణ ప్రక్రియ
### నోటీసుతో ఓటు హక్కు రద్దయినట్లు కాదన్న అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (చురకలు):** దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగ ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు సమాచారం. హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ తదితరులు నోటీసులు అందుకున్నవారి జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను ధ్రువీకరించేందుకే వీటిని జారీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నటుడు మహేశ్‌బాబు, ఆయన భార్య నమ్రత, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండతోపాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీకృష్ణ ప్రసాద్ దివి, రామ్‌చరణ్ సతీమణి ఉపాసన కొణిదెలకు కూడా నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది.

### వివరాల్లో తేడాలతోనే నోటీసులు?

ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుతం నమోదైన వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నోటీసుల్లో నిర్దిష్ట కారణాన్ని పేర్కొనలేదన్న వార్తలు కూడా వస్తున్నాయి. నోటీసులు అందుకున్నవారు నేరుగా హాజరై తమ వివరాలను ధ్రువీకరించుకోవచ్చని, అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగతంగా హాజరుకాలేని వారు తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించినట్లు సమాచారం. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం వివరాల ధ్రువీకరణ ప్రక్రియలో భాగమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### కర్ణాటకలోనూ ప్రముఖులకు..

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. కర్ణాటకలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులు అందినట్లు సమాచారం. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందంటూ వచ్చిన వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.





# టెక్ సపోర్ట్ పేరుతో మోసం

## భారత విద్యార్థికి 30 నెలల జైలు!

### వియత్నాం యుద్ధంలో పాల్గొన్న వృద్ధుడే లక్ష్యం
### లక్ష డాలర్లకు చేరువగా పరిహారం చెల్లించాలని ఆదేశం
### శిక్ష తర్వాత మూడేళ్లు అధికారుల పర్యవేక్షణ
### రెండోసారి డబ్బు తీసుకునేందుకు వెళ్లి చిక్కిన విద్యార్థి
### స్టూడెంట్ వీసాపై టెక్సాస్‌లో ఉంటున్న చాగంరెడ్డి

**వాషింగ్టన్, సెప్టెంబర్ 11 (చురకలు):** అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన భారత విద్యార్థి మోసం కేసులో జైలు పాలయ్యాడు. టెక్ సపోర్ట్ పేరుతో వియత్నాం యుద్ధంలో పాల్గొన్న ఓ వృద్ధుడిని మోసగించిన కేసులో వెంకటేశ్వర చాగంరెడ్డికి అమెరికా కోర్టు 30 నెలల జైలు శిక్ష విధించింది. బాధితుడికి 99,496 డాలర్లు (దాదాపు రూ.83 లక్షలు) పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. జైలు శిక్ష పూర్తయిన తర్వాత మరో మూడేళ్లపాటు అధికారుల పర్యవేక్షణలో ఉండాలని స్పష్టం చేసింది. ఒక్లహోమాలో నివసిస్తున్న వృద్ధుడికి మైక్రోసాఫ్ట్ టెక్నికల్ సపోర్ట్ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. బాధితుడి కంప్యూటర్‌లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని బెదిరించాడు. దీంతో భయపడిన వృద్ధుడికి తన వద్ద ఉన్న నగదును బంగారంగా మార్చి, ఇంటికి వచ్చే ఫెడరల్ అధికారికి అప్పగించాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు చెప్పినట్లుగానే చేశాడు. అయితే కొద్దిరోజుల తర్వాత మరోసారి ఫోన్ చేసి మరింత డబ్బు డిమాండ్ చేయడంతో వృద్ధుడికి అనుమానం వచ్చింది. కుటుంబ సభ్యుల సహాయంతో తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు.

### రెండోసారి వెళ్లి చిక్కాడు

రెండో విడత డబ్బు తీసుకునేందుకు బాధితుడి ఇంటికి వచ్చిన వెంకటేశ్వర చాగంరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో స్టూడెంట్ వీసాపై నివసిస్తున్న చాగంరెడ్డిని ఈ కేసులో ఏప్రిల్‌లోనే దోషిగా నిర్ధారించగా.. తాజాగా కోర్టు 30 నెలల జైలు శిక్షతోపాటు పరిహారం, మూడేళ్ల పర్యవేక్షణను ఖరారు చేసింది.

# పర్యావరణహిత మట్టి వినాయకుల పంపిణీ



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :**
స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జీవన్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం పర్యావరణహిత వినాయక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టితో అందమైన వినాయక విగ్రహాలను తయారు చేసి సమీప కాలనీల్లో పంపిణీ చేశారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీరు, గాలి కాలుష్యానికి గురై పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవని, ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. అందమైన మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, కిషోర్, హరి ప్రసాద్, ఎకో క్లబ్ బాధ్యులు డాక్టర్ స్వప్న, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :**
త్రైమాసిక పరిశీలనలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కట్టా హైమావతి శుక్రవారం కలెక్టరేట్ పక్కన ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాంను పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గోదాంను తెరిచి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గదుల ద్వారాలు, వాటికి ఉన్న సీళ్లను పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు గోదాంలో అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. గోదాం లోపల, బయట పరిసర ప్రాంతాల్లోని ప్రతి అంశం నిఘా కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందని రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. అనంతరం కలెక్టర్ సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. ప్రతినిధుల సమక్షంలో గోదాం ప్రధాన ద్వారానికి తాళం వేసి సీల్ వేశారు. ఈ మొత్తం ప్రక్రియను చిత్రీకరించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు చంద్రశేఖర్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కిరణ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సారెడ్డిని పరామర్శించిన దోర అరుణ్



**ప్రజాస్వామ్యంలో హింసకు, బెదిరింపులకు తావులేదు:** యూత్ కాంగ్రెస్ నాయకుడు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 11, : మాజీ ఎమ్మెల్యే, గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నర్సారెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు దోర అరుణ్ శుక్రవారం నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. రెహ్మాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ సమీర్ అహ్మద్‌తో కలిసి నర్సారెడ్డిని కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దోర అరుణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో హింసకు, బెదిరింపులకు ఎలాంటి స్థానం లేదన్నారు. గజ్వేల్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను అసెంబ్లీలో బలంగా వినిపించే, ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజాప్రతినిధి అవసరమని పేర్కొన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరై గజ్వేల్ ప్రజల గొంతుకగా నిలబడాలని, లేనిపక్షంలో రాజీనామా చేసి ప్రజలకు అందుబాటులో ఉండే మరో నాయకుడికి అవకాశం కల్పించాలని దోర అరుణ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రతి నాయకుడి పనితీరును ప్రజలు ప్రశ్నిస్తారని తెలిపారు. ప్రజల సమస్యలపై లెక్కలు అడిగి, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలే తుది తీర్పు ఇస్తారని దోర అరుణ్ పేర్కొన్నారు.

# పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి






- **జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రమేష్ బాబు**
- **కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తా**
- **పూర్వ విద్యార్థి, గ్రామ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి**

**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 11, :**
విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. రమేష్ బాబు పిలుపునిచ్చారు. కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వెల్‌కమ్ పార్టీ–2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన దశ అని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ జీవితాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడమే కాకుండా జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, సమయపాలన, మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలు, అనవసరమైన సోషల్ మీడియా వినియోగం వంటి వాటికి దూరంగా ఉండి, తమ సమయాన్ని చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలు, సామాజిక సేవకు వినియోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, అధ్యాపకులు విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో లభిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మరో అతిథి కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యకు సకల సౌకర్యాలు కల్పిస్తుంది. కళాశాల వసతులు కల్పనకు తనవంతు సహాయం అందిస్తానని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ మాట్లాడుతూ నూతన విద్యార్థులకు కళాశాల తరఫున స్వాగతం పలికారు. విద్యార్థులు కళాశాలలోని విద్యా, సాంస్కృతిక, క్రీడా మరియు ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు.అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, వివిధ వినోదాత్మక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గన్నారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..

## లింగాపూర్ స్కూల్లో మట్టి వినాయకులను తయారు చేసిన విద్యార్థులు

**తొగుట, సెప్టెంబర్ 11, :**
రానున్న వినాయక చవితి పండగ సందర్భంగా అందరం మట్టి వినాయకుడిని పూజిద్దామని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుదామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయురాలు నికిత పేర్కొన్నారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో గల మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో శుక్రవారం స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయుల సూచన మేరకు మట్టి వినాయకులను తయారు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించే క్రమంలో భాగంగా వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టితో తయారుచేసిన వినాయకులనే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన వినాయకులు పర్యావరణానికి హాని చేస్తాయని, అందుకోసమే మట్టితో తయారుచేసిన వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్కూల్లో మట్టితో వినాయకులను తయారు చేయడం సంతోషంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు రిషిక, అనన్య, గ్రీతిక, ధనుష్ అనీష్, ప్రసన్న, కేజియా, సుస్మిత, బిందుప్రియ, జయవర్ధన్, భాను, అయాన్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కోతలకు నిరసనగా రైతుల ఆందోళన

- **రాస్తారోకోతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్**
- **ప్రభుత్వం స్పందించాలని డిమాండ్**
- **లేదంటే కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరిక**



**అక్బర్ పేట భూంపల్లి, సెప్టెంబర్ 11, :** విద్యుత్ కోతలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 గంటల విద్యుత్ నిరంతరంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కి రైతులు ఆందోళన చేపట్టారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ శుక్రవారం మండల రైతులు నిరసనగళం విప్పారు. జాతీయ ప్రధాన రహదారిపై ఉన్న కూడవెల్లి వాగు బ్రిడ్జిపై రైతులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించని పక్షంలో త్వరలోనే సిద్దిపేట విద్యుత్ కార్యాలయంతో పాటు, సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని అధికారులను హెచ్చరించారు. మరోవైపు సకాలంలో యూరియా దొరక్క పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల ధర్నాతో జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న భూంపల్లి పోలీసులు వెంటనే ధర్నా స్థలానికి చేరుకుని, రైతులతో మాట్లాడి విద్యుత్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

# ఏఐ అనలాగ్, ఇంజనీరింగ్ భవిష్యత్తుపై ఆతిథ్య ఉపన్యాసం


**పటాన్చెరు, సెప్టెంబర్ 11, :**
ఏఐ అనలాగ్ టెక్నాలజీల సమన్వయం, ఇంజనీరింగ్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై ఆస్టర్ క్వాంటా వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రదీప్ వి. పైడా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆతిథ్య ఉపన్యాసం నిర్వహించారు. స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ పరిధిలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.'ఏఐ అనలాగ్, ఇంజనీరింగ్ భవిష్యత్తు' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసంలో ఏఐ, అనలాగ్ టెక్నాలజీల కలయిక, వీఎల్ఎస్ఐ డిజైన్, సిస్టమ్ ఆవిష్కరణలు, ఇంజనీరింగ్ రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలపై ఆయన వివరించారు.సెమీకండక్టర్ డిజైన్ రంగాన్ని మరింత వేగవంతంగా, అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ప్రదీప్ పైడా అన్నారు. సర్క్యూట్ సిమ్యులేషన్‌కు ముందుగా విద్యార్థులు సమస్యలను కాగితంపై విశ్లేషించి పరిష్కరించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. స్పెసిఫికేషన్ షీట్లను సమర్థవంతమైన సర్క్యూట్ డిజైన్లుగా మార్చడంలో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషించగలదని తెలిపారు.విద్యార్థులు నిరంతరం నేర్చుకుంటూ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై నైపుణ్యం సాధించాలని సూచించారు. గీతం విశ్వవిద్యాలయంతో ఆస్టర్ క్వాంటా సంస్థ సేవలు, పారిశ్రామిక అవకాశాల విస్తరణకు సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకునే అవకాశాలపై కూడా ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్.ఎం., అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# చేయూత నూతన పింఛన్ల పరిశీలనపై అధికారులకు శిక్షణ

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :**
చేయూత పథకం కింద నూతన పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచించారు. నూతన పింఛన్ల దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణపై జిల్లా పరిశీలన అధికారులకు శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన పింఛన్ దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన, దరఖాస్తుల తనిఖీ సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలు, అంతర్జాల ప్రక్రియ తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన వారికి పింఛన్ అందేలా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు శ్రీనివాస్, సుధీర్, పింఛన్ల విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సరిత తదితరులు పాల్గొని అధికారులకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు.





# తల్లిదండ్రులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలి

- సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :**
విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి కృషి చేయాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు అన్నారు. శుక్రవారం కళాశాలలో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. తమ పిల్లలు ప్రతిరోజూ కళాశాలకు సక్రమంగా హాజరవుతున్నారా, చదువుపై ఏవిధంగా దృష్టి పెడుతున్నారో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. కనీసం నెలకు ఒకసారి కళాశాలకు వచ్చి పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవాలని సూచించారు. యుక్తవయసులో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆరోగ్యం బాగుంటేనే విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించగలరని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం కనీసం రెండు గంటలు చదివేలా పిల్లలను ప్రోత్సహించడంతో పాటు ఇంటి వద్ద ప్రశాంతమైన చదువుకునే వాతావరణాన్ని కల్పించాలని కోరారు. సమాజం లో జరుగుతున్న పరిణామాలు, మంచి-చెడు, ఇతరులతో ఎలా మెలగాలి వంటి అంశాలను తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా చర్చించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ప్రతి విద్యార్థిని మంచి ఉత్తీర్ణత సాధించేలా కళాశాల తరపున ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, ఉపకార వేతనాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, తాగునీటి సౌకర్యం,




పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు వంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోందని, ఈ అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశానికి సుమారు 150 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. విద్యార్థుల ప్రగతి పత్రాలను తీసుకున్న తల్లిదండ్రులు వారి విద్యా ప్రగతి, హాజరు, ఆరోగ్యం, భవిష్యత్ అభివృద్ధిపై అధ్యాపకులతో చర్చించారు. కార్యక్రమంలో విద్యా విభాగ బాధ్యురాలు రాణి, విద్యార్థి సలహాదారు వందన, జాతీయ సేవా పథకం అధికారి శ్రీనివాస్‌తో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# పర్యావరణహిత గణపతే ముద్దు

- సృజనాత్మక 'ఎకో-ఏకదంత' కార్యక్రమం నిర్వహించిన గీతం విద్యార్థులు

**పటాన్చెరు, సెప్టెంబర్ 11, :**
గణేష్ చతుర్థి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించడంపై అవగాహన కల్పించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు శుక్రవారం 'ఎకో-ఏకదంత' కార్యక్రమాన్ని నిర్వహించారు.వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సహజ మట్టితో పర్యావరణ అనుకూల గణేష్ విగ్రహాలను తయారు చేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. జీవవిచ్ఛిన్నమయ్యే పదార్థాల వినియోగం, విషపూరిత రంగులు, ప్లాస్టిక్



అలంకరణలకు దూరంగా ఉండటం, వ్యర్థాల తగ్గింపు, సురక్షితమైన నిమజ్జన పద్ధతుల ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం ద్వారా వివరించారు.గణేష్ చతుర్థి విశ్వాసం, కళ, సమాజం, సంస్కృతిని ఏకం చేసే పండుగ అని నిర్వాహకులు పేర్కొన్నారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, జీవవిచ్ఛిన్నం కాని అలంకరణలు, హానికరమైన రంగుల వినియోగం వల్ల నిమజ్జనం సమయంలో చెరువులు, జలాశయాలు, నీటి వనరులకు నష్టం కలుగుతుందని తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా సహజ మట్టి విగ్రహాలను వినియోగించాలని, హరితమయమైన, బాధ్యతాయుతమైన గణేష్ చతుర్థి వేడుకలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విద్యార్థులు పిలుపునిచ్చారు.

# జిజ్ఞాస పరిశోధనా ప్రాజెక్టుల్లో రాష్ట్రస్థాయి అవార్డులు

- డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఘన సన్మానం

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11, :**
పటాన్‌చెరు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిజ్ఞాస స్టూడెంట్ రీసెర్చ్ ప్రాజెక్టుల్లో రాష్ట్రస్థాయి అవార్డులు సాధించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ అన్నారు. అవార్డుల విజయోత్సవ సభను కళాశాలలో నిర్వహించారు.తెలంగాణ వ్యవసాయ రంగంపై రాష్ట్రేతర వలస కార్మికుల ప్రభావం అంశంపై చేపట్టిన పరిశోధనా ప్రాజెక్టుకు అర్థశాస్త్ర విభాగంలో మొదటి బహుమతి లభించింది. ఫుడ్ అడల్టరేషన్ అంశంపై బాటనీ విభాగం ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి, ఇంగ్లీష్ స్కిల్ అంశంపై నిర్వహించిన పరిశోధనా ప్రాజెక్టుకు ఆంగ్ల విభాగంలో తృతీయ బహుమతి లభించాయి.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ మాట్లాడుతూ పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు విద్యా రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. అవార్డులు సాధించిన విద్యార్థులతో పాటు వారి సూపర్‌వైజర్లైన ప్రొఫెసర్ వెంకటేశం ఆకుల, డాక్టర్ జి. మల్లిక, డాక్టర్ షరీఫ్ మియాలను అభినందించారు.

### వికసిత్ భారత్ క్విజ్‌లో విద్యార్థుల భాగస్వామ్యం

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు వికసిత్ భారత్ యంగ్ లీడర్ క్విజ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ జి. జగదీశ్వర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు వివిధ కార్యకలాపాలపై ఓరియంటేషన్ కల్పించారు. జాతీయ సమైక్యత శిబిరం, రిపబ్లిక్ డే పరేడ్, అడ్వెంచర్ క్యాంప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

### పర్యావరణహితమైన మట్టి గణపతుల పంపిణీ

ఎండిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



ఫౌండేషన్ అధ్యక్షులు పృథ్వీరాజ్, వినయ్, విక్రమ్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, సీసం, ఇతర రసాయనాలతో తయారైన విగ్రహాల నిమజ్జనం వల్ల పర్యావరణం, చెరువులు, జలచరాలకు నష్టం కలుగుతుందని తెలిపారు.మట్టి గణపతులను పూజించి ఇంటి వద్దే నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్

- సాగునీటికి నీటిని విడుదల చేయడం లేదు.. తాగునీటికే వినియోగం..

**కొమురవెల్లి, సెప్టెంబర్ 11, :**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్‌లోని నీటి నిల్వ, కాలువల పరిస్థితి, నీటి పంపిణీ తదితర అంశాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.తపాస్‌పల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 0.3 టీఎంసీలు కాగా, గోదావరి నదిలో దేవాదుల వద్ద నీటి ప్రవాహాన్ని బట్టి ప్రస్తుతం 0.2 టీఎంసీల నీటిని రిజర్వాయర్‌లోకి పంపించి నిల్వ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతానికి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేయడం లేదని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న





నేపథ్యంలో రిజర్వాయర్లలోని నీటిని తాగునీటి అవసరాలకే వినియోగిస్తున్నామని, వ్యవసాయ అవసరాలకు నీటిని విడుదల చేయడం లేదని పరివాహక ప్రాంత రైతులకు కలెక్టర్ సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు సహకరించాలని కోరారు. అనంతరం తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన కుడి, ఎడమ కాలువలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామం మీదుగా వెళ్లే కాలువతో పాటు చేర్యాల మండలం కమలాయపల్లి వద్ద ఉన్న కాలువలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్, కార్యనిర్వహణ ఇంజినీర్, ఉప కార్యనిర్వహణ ఇంజినీర్ తదితర అధికారులు ఉన్నారు.

# ఐదుగురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

**చిన్నకోడూరు, సెప్టెంబర్ 11, :**
చిన్నకోడూరు మండలానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. పాఠశాల సహాయకుల విభాగంలో అల్లీపూర్‌కు చెందిన రవీందర్‌రెడ్డి, కస్తూరిపల్లికి చెందిన భీమిరెడ్డి రవీందర్‌రెడ్డి అవార్డులు అందుకున్నారు. ఎస్జీటీ విభాగంలో దాసరి వాడకు చెందిన మాధవి, చిన్నకోడూరుకు చెందిన రజిత, అనంతసాగర్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు మాధవీలతలకు అవార్డులు లభించాయి. శుక్రవారం టీటీఆర్సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, రాష్ట్ర చేనేత సహకార కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి అవార్డులు రావడం పట్ల మండల విద్యాశాఖ అధికారి తిరుపతి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# విద్యార్థుల బకాయి ఫీజులు వెంటనే విడుదల చేయాలి

## బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లో నిరసన ర్యాలీ




**హైదరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.11 వేల కోట్ల పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్వీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# స్వయం ఉపాధితో ముందుకు సాగాలి

- నూతన టీ షాప్ ను ప్రారంభించిన మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు

**కుతులాపూర్ ప్రతినిధి, సెపెంబర్ 11, :**



సాయిబాబా నగర్ డివిజన్‌లోని రాజీవ్ గృహకల్పలో నర్సింగ్ రావు నూతనంగా ఏర్పాటు చేసిన టీ షాప్‌ను మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు మన్నె రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ.. చిన్న వ్యాపారాలు కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని అన్నారు. స్వయం ఉపాధిని ఎంచుకుని ముందుకు సాగుతున్న నర్సింగ్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారం దినదినాభివృద్ధి చెంది మంచి పేరు, ఆదాయం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చక్రి, భాస్కర్ రెడ్డి, కుమారి, సుధాకర్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకంఠమహేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గూడూరు సమత-మహేష్ గౌడ్

**నాగారం, సెప్టెంబర్ 11, :**
శ్రీ కంఠమహేశ్వర స్వామి, ఎల్లమ్మ తల్లి దేవాలయంలో శ్రావణ అమావాస్య సందర్భంగా కల్లుగీత పారిశ్రామిక సంఘం మాజీ అధ్యక్షులు గూడూరు సమత-మహేష్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగారం డివిజన్ పరిధిలోని సూర్య ఎంక్లేవ్ లోని శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాసం అమావాస్య సందర్భంగా భక్తిశ్రద్ధలతో కల్లుగీత పారిశ్రామిక మాజీ అధ్యక్షులు గూడూరు సమత మహేష్ గౌడ్ శుక్రవారం స్వామివారికి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు చంద్రశేఖర శర్మతో గూడూరు సమత మహేష్ గౌడ్ లు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్య, త్రయోదశి రోజున శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు అర్చనలు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.



# జిల్లా కేంద్రంలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలి

## అసెంబ్లీలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 11, :** జగిత్యాల జిల్లా కేంద్రంలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట ఐటీ హబ్ లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, ఐటీ హబ్ వల్ల ఐటీ విద్యార్థులకు, నిరుద్యోగులకు చాలా ఉపయోగంగా ఉంటుందని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఉత్తర తెలంగాణలో జగిత్యాల ముఖ్యమైన ప్రాంతమని, ఐటీ హబ్ ఏర్పాటు వల్ల నిరుద్యోగులు అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వంలో ఐటీ మంత్రిని జగిత్యాలలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు శ్రీదర్ బాబు మంత్రిగా ఉన్నపుడు జేఎన్టీయూ కళాశాల, బాసర ఐఐటీ వచ్చాయని అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని సభా వేదికగా మంత్రి శ్రీదర్ బాబుని కోరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్.



చురకలు



# వినాయక నిమజ్జన ఏర్పాట్లు 70 శాతం పూర్తి

- **మిగిలిన పనులను సెప్టెంబర్ 13లోపు పూర్తి చేయాలి: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకీష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ ఆధ్వర్యంలో నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి, చింతల్, గాజులరామారం, జీడిమెట్ల సర్కిళ్లలోని నిమజ్జన ప్రదేశాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. అనంతరం జోనల్ కమిషనర్ పింకీష్ కుమార్ ఇంజినీరింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిమజ్జన ప్రదేశాలకు వెళ్లే ప్రధాన రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్య చర్యలు, వీధి దీపాల ఏర్పాటు, చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనుల్లో ఇప్పటికే 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన పనులను సెప్టెంబర్ 13లోపు పూర్తిచేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో అసెంబ్లీ కో-కన్వీనర్ నల్ల జై శంకర్ గౌడ్, డివిజన్ కన్వీనర్లు మాధవులు, శంకర్ గౌడ్, నరసింహ, ఎల్లస్వామి, శ్రీరాములు, కీర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి

- **మండపాల ఏర్పాటు, ఊరేగింపులకు పోలీసులకు ముందస్తు సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలి**
- **సిద్దిపేట సీపీ సాధన రష్మీ పెరుమాళ్**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలు, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మండపాల నిర్వాహకులకు సూచించారు. వినాయక మండపాలను ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగా తెలంగాణ పోలీస్ పోర్టల్ ద్వారా సమాచారం అందించి, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ముందస్తు సమాచార పత్రాలను సమర్పించాలని తెలిపారు. ముఖ్యంగా రహదారులు, కాలిబాటలు, ప్రజలు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేయరాదని, ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, డీజేలు, అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదని తెలిపారు. ఇతర మతాల వారి మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు, వివాదాస్పద పాటలు ప్రసారం చేయవద్దని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించి నిమజ్జనం చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మవద్దని, నిర్ధారణ లేని సందేశాలు, వీడియోలను ఇతరులకు పంపించవద్దని కోరారు. మండపాల వద్ద భద్రత కోసం ఎల్లవేళలా ప్రత్యేక స్వచ్ఛంద కార్యకర్తలు అందుబాటులో ఉండేలా చూడాలని, వారి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైనా, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా వెంటనే 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ కోరారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు.

# దాతల చేయూత ప్రశంసనీయం

- **పేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాలి: హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షుడు తూటే విజయ్ కుమార్**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** పేద విద్యార్థుల విద్యకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని హెల్పింగ్ హార్ట్ సొసైటీ అధ్యక్షుడు తూటే విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం షాపూర్ నగర్ డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌లోని సాయిలతా మోడల్ హైస్కూల్‌లో హెల్పింగ్ హార్ట్ సొసైటీ ఆధ్వర్యంలో, శక్తి జ్యువలర్స్ సౌజన్యంతో పదో తరగతి 2026 బ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. మండల స్థాయిలో 593/600 మార్కులతో ప్రథమ ర్యాంక్ సాధించిన వై. భవ్యలక్ష్మి తో పాటు 570/600 మార్కులు సాధించిన సాయితరుణి, 567/600 మార్కులు సాధించిన సింధుజలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులతో కలిసి సిల్వర్ మెడల్స్, ప్రశంసాపత్రాలతో అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులోనూ ఇదే ప్రతిభను కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తూటే విజయ్ కుమార్ మాట్లాడుతూ.. "మన జీవితాలను మార్చే శక్తి విద్యకే ఉంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుండా సమాజంలోని దాతలు తమ వంతు సహకారం అందించాలి" అని పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ హక్కుల సమితి డైరెక్టర్ మధుబాబు చికిలే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవడంతో పాటు ఇష్టపడి చదవాలని, భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. దాత వీరేందర్ సింగ్ మాట్లాడుతూ ఆర్థిక



సమస్యల కారణంగా ఎవరి చదువూ ఆగిపోకూడదనే సంకల్పంతో తనకు తోచిన మేరకు విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దయాకర్, సీనియర్ నాయకులు సయ్యద్ సాజిత్, వెబ్‌ట్రిక్స్ సందీప్ బల్లెం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలు



- **తారా ప్రభుత్వ కళాశాలలో ప్రతిమల తయారీ**

**సంగారెడ్డి ప్రతినిధి,సెప్టెంబర్ 11, :** తారా ప్రభుత్వ కళాశాల (ఎ) సంగారెడ్డిలో ఈకో క్లబ్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను తయారీ చేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం ప్రవీణ మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి పూజించడం వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల సహజమైన మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉపయోగించడం పర్యావరణహితమైన విధానమని తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ బి సోఫియా రాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుచిత్రా సింగ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల తయారీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.

మట్టి వినాయకుడు పర్యావరణానికి మేలు, మన ఆరోగ్యానికి మేలు, అనే సందేశాన్ని విద్యార్థులు సమాజానికి అందించారు. కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్య నివారణ మరియు ప్లాస్టిక్/రసాయన రహిత పండుగల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# హైదరాబాద్ విలీనం సీపీఐ పోరాట ఫలితమే

- **సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాలి: సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన సాయుధ పోరాటం కీలక పాత్ర పోషించిందని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ. ఉమా మహేష్ అన్నారు. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాలను శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్‌లో ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ కీర్తిశేషులు బండి నాగయ్య విగ్రహం సమీపంలోని అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఉమా మహేష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు జరుగుతున్న సమయంలో హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలు నిజాం నిరంకుశ పాలనలో తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొన్నారని అన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయాలని కోరుతూ కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందన్నారు. సాయుధ పోరాటం ద్వారా సుమారు 4,500 గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు, ముఖ్యంగా భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత సీపీఐ కార్యకర్తలపై ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వక్రీకరిస్తున్నాయని ఉమా మహేష్ విమర్శించారు. సాయుధ పోరాట విజయాన్ని కేవలం పటేల్ సైన్యం వల్లే సాధ్యమైందని చెప్పడం ద్వారా కమ్యూనిస్టుల పోరాటాన్ని తక్కువ చేసి చూపుతున్నారని ఆరోపించారు. నిజాం పాలనలో అరెస్టయినవారు, ఉరిశిక్షలు ఎదుర్కొన్నవారి విడుదలకు సంబంధించిన చారిత్రక అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ నిజమైన చరిత్రను రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉమా మహేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు వి. హరినాథ్‌రావు, డి. రాములు, ప్రజానాట్యమండలి బాబు, సీపీఐ నాయకులు నర్సింహారెడ్డి, సహదేవరెడ్డి, వెంకటాచారి, వెంకటేష్, శ్రీనివాస్ చారి, శ్రీనివాస్, పెంటన్న, కార్తీక్, యువజన నాయకులు జంబూ, ధర్మేంద్ర, సాహు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ రాజకీయ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- **సేవా సంకల్ప్ అభియాన్ కార్యాశాలలో ఎంపీ రఘునందన్ రావు**

**సిద్దిపేట జిల్లా ప్రతిని, సెప్టెంబర్ 11, :** ప్రధాని మోదీ రాజకీయ జీవితాన్ని, ఆయన అంకితభావాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ శ్రేణులకు ఎంపీ రఘునందన్ రావు సూచించారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో వివిఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కార్యశాలలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గుజరాత్ సీఎంగా, భారత ప్రధానిగా ప్రభుత్వంలో నిరాటంకంగా పాతికేళ్లుగా ప్రధాని మోదీ కొనసాగుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల నిర్విరామ సేవా ప్రయాణాన్ని, దేశాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిని, వికసిత్ భారత్ 2047 సంకల్పాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా ఈ నెల 17 నుండి అక్టోబర్ 17 వరకు చేపట్టిన 'సేవా సంకల్ప అభియాన్' ప్రోగ్రాంను విజయవంతం చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సేవా సంకల్ప్ ప్రోగ్రాంకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. దేశం కోసం, ప్రజల సంక్షేమం కోసం సేవా సంకల్పంతో నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు వంగ రామచంద్రారెడ్డి, సొప్పదండి విద్యాసాగర్, అంబటి బాలేష్ గౌడ్, తుంగ కనకయ్య, విభీషన్ రెడ్డి, వెంకటేశం, బాసంగారి వెంకట్,



రాంగోపాల్ రెడ్డి, సుభాష్ రెడ్డి, గుండ్ల జనార్ధన్, గోనె మార్కండేయులు, వంశీకృష్ణ, నాగరాజు, తిరుమల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సీజ్ చేసిన 320 లీటర్ల డీజిల్ వేలం

**నేరడిగొండ,సెప్టెంబర్ 11, :** నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జప్తు చేసిన 320 లీటర్ల డీజిల్ ను వేలం వేయనున్నట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ వేలం పాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలం పాట కార్యక్రమానికి సంబంధించిన ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వేలం పాటకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం నేరడిగొండ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

# గాజులరామారం సర్కిల్‌లో కమిషనర్ సృజన పర్యటన

- **స్థానిక సమస్యలపై ఆరా.. త్వరితగతిన పరిష్కారానికి హామీ**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** 'వన్ డే-వన్ వార్డ్' కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, కుత్బుల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా టీఎస్ఐఐసీ కాలనీలోని పార్కు వద్ద కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు



తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, పార్కుల ఆధునీకరణ, వీధిదీపాల మరమ్మతులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వర్షపు నీటి కాలువల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర సమస్యలను వివరించారు. స్థానికుల అభ్యర్థనలను పరిశీలించిన కమిషనర్ సృజన, అవసరమైన ప్రాంతాల్లో త్వరితగతిన చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ వెంకట రాములు, ఏఎంసీ ప్రమీల, ఈఈ గోవర్దన్ గౌడ్, ఎలక్ట్రికల్ డిప్యూటీ ఈఈ లావణ్య, నిఖిల్ రెడ్డి, ఏసీపీ సుమిత్ర, డిప్యూటీ ఈఈ (ఇంజనీరింగ్) మహదేవ్ అనురాగ్, మేనేజర్ విజయరాణి, జలమండలి అధికారులు, టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- సాయుధ పోరాట చరిత్రను బీజేపీ హిందూ, ముస్లింల మధ్య కొట్లాటగా వక్రీకరిస్తుంది
- మంద పవన్, సీపీఐ జిల్లా కార్యదర్శి




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులే అని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే అని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట అమరులు, సిద్దిపేట మొట్ట మొదటి ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి సీపీఐ సిద్దిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో మంద పవన్ జిల్లా నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించి, ఈ నెల 11 నుండి 17 వరకు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో నేటి నుంచి 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ వ్యవస్థ, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో తెలంగాణ రైతాంగం నిర్వహించిన వీరోచిత సాయుధ పోరాట చరిత్రను బీజేపీ నేతలు వక్రీకరించి అబద్ధాలతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ మత విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. హిందూ ముస్లింలు కలిసి సంఘటితంగా నియంతృత్వ నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటమే సాయుధ పోరాటమని, ఇది నిజమైన చరిత్ర అని, దీనిని వక్రీకరిస్తే బీజేపీ నేతలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ముమ్మాటికీ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. దోపిడీ, దురహంకారం, అసమానత్వాన్ని రూపుమాపేందుకు సాయుధ పోరాటం సాగిందని, తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు ఉద్యమించాలని, సాయుధ పోరాట యోధుల త్యాగాలను, దేశభక్తిని, పోరాటాన్ని గౌరవించడం, తెలుసుకోవడం యువత బాధ్యత అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం తెలంగాణ గడ్డపై మట్టి మనుషులు చేసిన పోరాటాలకు 78ఏళ్లు నిండాయని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో నాటి నిజాం రాచరిక పాలనలో అణిగిపోయి "బాంచను నీ కాల్మొక్కుతా" అన్న ప్రజల చేత బందూకులు పట్టించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, తెలంగాణ రైతాంగ పోరాట చరిత్ర ప్రపంచ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని ఆయన గుర్తు చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి పోరాట వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి గజభీంకర్ బన్సీలాల్, సహాయ కార్యదర్శి ఎస్ కె హరిఫ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మిట్టపల్లి సుధాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొమ్ము కనకరాజ్, నాయకులు యాద మల్లయ్య, మన్నే రవి, బెజగాం బాబు, మహంకాళి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు బత్తుల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మాజీపేట ఉపాధ్యాయుడికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** దుబ్బాక మండలం ధర్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పురస్కారాల ప్రధానోత్సవంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, డీసీఈబీ చైర్మన్ చక్రపాణి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామస్వామి, డీఎస్ఓ రాజమౌళి పాల్గొన్నారు. గణిత బోధనలో వినూత్న పద్ధతులు, విద్యార్థులను పోటీ పరీక్షలకు తీర్చిదిద్దడంలో శ్రీనివాస్ రెడ్డి విశేష కృషి చేస్తున్నాడు. ఇటీవల శ్రీ మేధా ఫౌండేషన్‌కు జిల్లా నుండి ఎంపికైన ఏకైక విద్యార్థి ధర్మాజీపేట పాఠశాలకు చెందినవాడు కావడం, ఆ విద్యార్థి గణితంలో 80 శాతం మార్కులు సాధించడం ఆయన బోధనా పటిమకు నిదర్శనం. ఈ పురస్కారం పాఠశాలకే గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్, పాఠశాల ఉపాధ్యాయులు మహమ్మద్ సాదత్ అలీ, పల్లె శ్రీనివాస్ గౌడ్, వెంకట కృష్ణమాచారి, శ్రీకాంత్, బాలకృష్ణ, పద్మావతి, శైలజ, దినేష్, సిహెచ్ చంద్రశేఖర్, వహీద్, సిఆర్పి నవీన్ కుమార్, రేణుక, కావ్య, వార్డు కౌన్సిలర్లు అభినందనలు తెలిపారు.



# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి జి. జయరాజు**




**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11, :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. జయరాజు పిలుపునిచ్చారు. సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రామిక్ భవన్‌లో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు.1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని జయరాజు అన్నారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన ఈ పోరాటం ద్వారా సుమారు ఐదు లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఉందన్నారు. భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాడారని గుర్తు చేశారు.1946 జూలై 4న ప్రారంభమైన ఈ పోరాటం 1951 అక్టోబర్ వరకు కొనసాగిందన్నారు. దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల దాడుల్లో వేలాది మంది సామాన్య ప్రజలు, కమ్యూనిస్టు నాయకులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అప్పటి కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో పోరాటం సాగిందన్నారు. దొడ్డి కొమరయ్య తొలి అమరుడిగా నిలిచారని, వీరనారి చాకలి ఐలమ్మ దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ప్రస్తుత పాలకులు వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని జయరాజు విమర్శించారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీనం, విమోచనం పేరుతో రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ఈ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. భూములు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు బి. నాగేశ్వరరావు, ఎం. రేవంత్ కుమార్, సీనియర్ నాయకులు ఎం.డి. వాజిద్ అలీ, పి. పాండురంగారెడ్డి, నాయకులు సత్తిబాబు, వెంకట్‌రామ్ రెడ్డి, ప్రదీప్, నల్లగండ్ల రాజు, బి. జయరాం, యాక రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పారా లీగల్ వాలంటీర్లుగా దరఖాస్తు చేసుకోవాలి




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** ప్రజలకు న్యాయపరమైన అవగాహన కల్పించడంతో పాటు వారికి తగిన న్యాయ సహాయం అందించాలనే ఆసక్తి, సేవా దృక్పథం ఉన్నవారు పారా లీగల్ వాలంటీర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి సుదర్శన్ తెలిపారు. ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, సామాజిక సేవలో పట్టా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 30, 2026 సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తుతో పాటు బయోడేటా, గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సంబంధిత ధ్రువపత్రాలను అందజేయాలని సూచించారు. పారా లీగల్ వాలంటీర్లకు కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణత అని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ తరగతులు నిర్వహించి, అనంతరం 50 మందిని పారా లీగల్ వాలంటీర్లుగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి న్యాయ సేవల ప్రాధికార సంస్థ చట్టం ప్రకారం గౌరవ వేతనం చెల్లిస్తామని జి సుదర్శన్ తెలిపారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ, అక్రమ వసూళ్లపై తక్షణ చర్యలు తీసుకోవాలి

- వైద్యాం అనేది సేవా రంగం వ్యాపారంగా కాదు
- టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత వైద్య పథకాన్ని అమలు
- టిఆర్ఎస్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్




**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పేరుతో అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు పేషెంట్ కు అనవసరమైన పరీక్షలు, ఇష్టం వచ్చినట్లు మందులు ఇస్తున్నారు వాటి ద్వారా రోగులకు ఆరోగ్యం దెబ్బ తినడంతో పాటు అ యొక్క కుటుంబానికి అదనపు భారం కూడ అవుతుంది. ప్రైవేట్ హాస్పిటల్స్ లో విజిటింగ్ డాక్టర్స్ పేరుతో ఇష్టం వచ్చినట్లు ఛార్జీలు వెయ్యడం ద్వారా సామాన్య ప్రజలు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. కరీంనగర్ జిల్లాలో పెద్దఎత్తున హాస్పిటల్ దంద నడుస్తుంది పేద, మధ్యతరగతి కుటుంబాలలో ఎవరికైనా అనారోగ్యం వస్తే వైద్యం చేయించు కోవడం కష్టంగా మారిందని, ఆసుపత్రి బిల్లులు వాళ్ళు వేసే బిల్లును చూస్తేనే గుండెపోటు వస్తుందని ఇంట్లో ఒక్కరూ ప్రైవేటు హాస్పిటల్ చేరితే కుటుంబం మొత్తం రొడ్డు మీద పడటమే అవుతుంది వాళ్ళు వేసే బిల్లులు మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఆరోగ్య సేవలను అందించడం మానవతా బాధ్యత అలాంటిది ప్రజల అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకుని అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్నారు. వైద్యం పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులు సాగిస్తున్న ఆర్థిక దోపిడీ పట్ల ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. ఆరోగ్యం అనేది వ్యాపార వస్తువు కాదు, అది మానవతా దృక్పథంతో కూడిన సేవ. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆరోగ్య శాఖ స్పందించి ప్రైవేట్ ఆసుపత్రులపై గట్టి నిఘా పెట్టి సామాన్యుడికి న్యాయం చేయాలని లేనిఎడల తెలంగాణ రక్షణ సేన ఆద్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని జిల్లా పార్టీ బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

# సూరారం జెడ్పీ హైస్కూల్‌లో మట్టి వినాయకుల పంపిణీ



- ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలి.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 11, :** సూరారం కాలనీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు 200 మట్టి వినాయక విగ్రహాలు, 300 చేతి సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా విడనాడి, వాటికి బదులుగా చేతి సంచులను ఉపయోగించాలని సూచించారు. కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి చేతి సంచులను తీసుకెళ్లేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు తాము భవిష్యత్తులో కృషి చేస్తామని, ప్లాస్టిక్ కవర్లను వినియోగించబోమని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పుణ్యవతి, మల్లికార్జున్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలి
- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



**జగిత్యాల/ధర్మపురి, సెప్టెంబర్ 11, :** ధర్మపురి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేస్తున్న నోటీసులు, వాటిపై నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాలు, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పూర్తి స్థాయిలో నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు, తేడాలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, అందజేత, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తదితర ప్రతి దశను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమని" జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి , తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శాఖ అధికారులు బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# కెసిఆర్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలి

## పిసిసి అధికార ప్రతినిధి, జిల్లా ఇంచార్జ్ కమలాకర్




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :**
కెసిఆర్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని టిపిసిసి అధికార ప్రతినిధి, జగిత్యాల జిల్లా మీడియా ఇంచార్జ్ కమలాకర్ అన్నారు. జగిత్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్యతో కలిసి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ వారు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ అగౌరపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం, దళితుల పట్ల బిఆర్ఎస్ వారికి ఉన్న చిన్న చూపు తెలుస్తుందని, దాన్ని సహించని దళిత సమాజం కెసిఆర్ ఫామ్ హౌస్ ను చావు దప్పుతో ముట్టడించే ప్రయత్నం చేస్తే వారు వెళ్ళిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితులను అవమానించడమేనని, ఇలాంటి సిగ్గుమాలిన పనులు చేస్తున్న కేసీఆర్, కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పిసిసి సభ్యులు గిరి నాగభూషణం, కొత్తమోహన్, పిసీసీ సెక్రెటరీ బండ శంకర్, పిసిసి సేవాదళ్ సెక్రటరీ బోగోజీ ముఖేష్ కన్నా,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమాల రాజ్ కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మన్సూర్ అలీ, బలుస సాయి తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

## గజ్వేల్ సిఐ రవి కుమార్



**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 11, :**
రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో నిర్వహించేందుకు ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.
ఈసమావేశంలో వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రాంతానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ రవి కుమార్ మాట్లాడుతూ వినాయక మండపం నిర్వాహకులందరూ అవసరమైన సమాచార ఫారమ్‌లు సంబంధిత పత్రాలను తెలంగాణ పోలీసు వెబ్‌సైట్ హెచ్టిటిపిఎస్:// పోలీసుపోర్టల్.టీఎస్ పోలీస్. గవర్నమెంట్.ఇన్/ఇండెక్స్. హెచ్టిఎం ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలియజేశారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులకు పలు భద్రతా జాగ్రత్తలు ముఖ్యమైన సూచనలు అందజేశారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో శాంతి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు క్రింది సూచనలు అందజేశారు. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుండి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలి. మండపాల వద్ద విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు చేపట్టాలి. మండపాల వద్ద వాలంటీర్లను ఏర్పాటు చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. అధిక శబ్దంతో డీజేలు/సౌండ్ సిస్టమ్స్ వినియోగించకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించాలి. ఇతర మతాలు, వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి నినాదాలు, పాటలు లేదా చర్యలకు పాల్పడరాదు.సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా లేదా ప్రచారం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలి. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలి. నిమజ్జనం సమయంలో నిర్వాహకులు వాలంటీర్లు పోలీస్ సిబ్బందికి పూర్తిగా సహకరించాలి. మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, గొడవలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని పోలీస్ అధికారులు నిర్వాహకులను కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదంలో వ్యక్తిపై దాడి

## నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

**తాండూర్, సెప్టెంబర్ 11, :** భూమి వివాదం నేపథ్యంలో భూ యజమానిపై దాడి చేసి గాయపర్చిన కేసులో నిందితుడిని తాండూర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తాండూర్ ఎస్సై కె.ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. బోయపల్లి గ్రామంలో భూమి విషయంలో ఏర్పడిన వివాదం నేపథ్యంలో కయితశ్రీ నిఖిల్ భూమి యజమానిపై దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ ఘటనలో బాధితుడు గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు కయితశ్రీ నిఖిల్ను అరెస్టు చేశారు. అనంతరం బెల్లంపల్లి న్యాయస్థానం ఎదుట హాజరుపర్చగా, న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. భూ వివాదాలు, వ్యక్తిగత తగాదాల నేపథ్యంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు వివాదాలను చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు.

# దళితులను అవమానించే వ్యాఖ్యలను సహించం

- ఎర్రవల్లి ఘటనపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆగ్రహం
- కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ క్షమాపణ చెప్పాలి: దళిత నాయకుల డిమాండ్

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11, :**
ఎర్రవల్లి, వరదరాజపూర్ గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో దళితుల నిరసన అనంతరం పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేసిన ఘటనపై పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులను అవమానించే విధంగా వ్యవహరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, ఘటనకు బాధ్యులు దళిత సమాజానికి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.పటాన్‌చెరు పట్టణంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ దళితులను అవమానించే వ్యాఖ్యలు, కుల వివక్షను ప్రతిబింబించే చర్యలను తీవ్రంగా ఖండించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతున్నప్పటికీ అంటరానితనం, కుల అహంకారం వంటి భావజాలాలు కొనసాగడం బాధాకరమన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు కాటా శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, దేవానందం, తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ భరత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలు, చర్యలను సహించేది లేదని నాయకులు స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవం కల్పించిందని గుర్తు చేశారు. ఒక వర్గాన్ని కులం ఆధారంగా తక్కువ చేసి చూడటం ప్రజాస్వామ్య సమాజానికి తగదన్నారు. ఇటీవల అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలను కూడా వారు ప్రస్తావించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాత మధుసూదన్ చేసిన వ్యాఖ్యలు, వ్యవహరించిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. శాసనసభ ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే వేదిక అని, అక్కడ ఉన్నత పదవుల్లో ఉన్నవారు హుందాగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎర్రవల్లి, వరదరాజపూర్ ఘటనపై కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ తమ వైఖరిని స్పష్టం చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ సమాజంలో కుల వివక్షకు తావులేదని, దళితులను అవమానించే విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.గతంలో దళితులకు ఇచ్చిన హామీల అమలుపై కూడా నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో దళిత ముఖ్యమంత్రి, దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి వంటి హామీలు ఇచ్చినప్పటికీ అవి ఎంతవరకు అమలయ్యాయో ప్రజలు పరిశీలించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం దళిత వర్గానికి చెందిన వ్యక్తిని శాసనసభ స్పీకర్‌గా నియమించడం, దళితులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం వంటి అంశాలను వారు ప్రస్తావించారు. దళితులు, ఎస్టీలు, మైనారిటీలను అవమానించేలా ఎవరైనా మాట్లాడితే తెలంగాణలోని దళిత సంఘాలు ఐక్యంగా స్పందిస్తాయని హెచ్చరించారు.కుల వివక్షను ప్రోత్సహించే విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జై శ్రీ, మహేష్, శంకరయ్య, పీటర్, నాగేష్, చంద్రయ్య, ప్రవీణ్, రవి, సందీప్, హనుమంతు, కిరణ్, శ్రీను, ప్రకాష్ తదితర దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- పదో తరగతి విద్యార్థినులకు విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, :**
జగిత్యాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజ గౌడ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచితో పాటు విద్యార్థినులకు అందుతున్న ఆహారంపై వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి



తెలుసుకున్నారు.విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం చేశారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని తన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, పరీక్షల కోసం అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ఘనంగా వివేకానంద విగ్రహ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలు

**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 11, :**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలను శుక్రవారం వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సభ్యులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు కంచర్ల గంగాచారి మాట్లాడుతూ వివేకానందుడు 1893 సంవత్సరంలో అమెరికాలోని చికాగో పట్టణంలో సర్వమత మహాసభలో పాల్గొని హిందూ ధర్మ విశిష్టతను, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన రోజును పురస్కరించుకొని కొడిమ్యాలలో 2013లో వివేకానందుని విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందని గుర్తు చేశారు. స్వామి వివేకానంద 1863 లో జన్మించి 1893లో తన 30 సంవత్సరాల యవ్వనంలోనే అమెరికాలోని చికాగో పట్టణంలో సర్వమత మహాసభలో తన ఉద్వేగ భరిత ప్రసంగాన్ని అందించి హిందూ ధర్మ సంస్కృతిని పరంపరను గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పి మన భారతదేశ విశిష్టతను గౌరవాన్ని కాపాడారని తెలియజేశారు. ఇప్పటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని వివేకానందుని అడుగుజాడల్లో నడిచి దేశ ప్రగతిని పెంపొందింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు మంచాల శ్రీనివాస్ చెన్న దేవేందర్ విశ్వహిందూ పరిషత్



మండల అధ్యక్షుడు ఎర్రోజు శ్రీధర్ తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఏనుగు ఆదిరెడ్డి, గొట్టాల పవన్, నాంపల్లి శ్రీనివాస్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఈ నెల 12, 13న ఓటరు జాబితాల ప్రత్యేక ప్రచార కార్యక్రమం

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్య ప్రసాద్

**జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 11, :**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 1 2026 అర్హత తేదీగా చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ–2026లో భాగంగా, క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల స్వీకరణకు రెండో విడత ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్నట్లు జగిత్యాల జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ తెలిపారు. జగిత్యాల జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు రెండు రోజులూ తప్పనిసరిగా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లు తమ




పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం–6, ఓటరు జాబితాలోని పేరుపై అభ్యంతరం లేదా తొలగింపు కోసం ఫారం–7, వివరాల సవరణ లేదా చిరునామా మార్పు కోసం ఫారం–8 సమర్పించవచ్చని తెలిపారు. సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లు కూడా ప్రత్యేక ప్రచార రోజుల్లో పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. బిఎల్ఓలు, బిఎల్ఎ ల సమక్షంలో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, అవసరమైన సవరణలను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత, ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు.

# మాజీ మంత్రి హరీష్ రావుకు మట్టి వినాయక ప్రతిమను అందించిన బిఆర్ఎస్వి నేత

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 11, :**
మాజీ మంత్రి హరీష్ రావును హైదరాబాదులోని ఆయన నివాసంలో బిఆర్ఎస్వీ నేత అఖిల్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అఖిల్ హరీష్ రావుకు మట్టి వినాయక ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, అందుకోసమే మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు అందజేస్తున్నట్లు అఖిల్ పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మట్టి విగ్రహాల వినియోగం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమను స్వీకరించిన మాజీ మంత్రి హరీష్ రావు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసాద్, అద్నాన్, సబిల్ తదితరులు పాల్గొన్నారు.






# అనేక సంస్కరణలకు ఆద్యుడు సుబ్రహ్మణ్య భారతి

## ఆధునిక తమిళ సాహిత్యానికి మార్గదర్శకుడు సుబ్రహ్మణ్య భారతి

### నేడు సుబ్రహ్మణ్య భారతి వర్ధంతి

కవిత్వంలో ప్రగతి శీలమైన, సంస్కరణాత్మకమైన ఆదర్శాన్ని వ్యక్తీకరించిన కవి సుబ్రహ్మణ్య భారతి. ఆధునిక తమిళ సాహిత్యానికి ఆయనను మార్గదర్శకునిగా భావిస్తారు. ప్రాచీన, సమకాలీన అంశాల మేలు కలయికగా నిలిచే కవిత్వ శైలి ఆయన సొంతం. ఆధునిక తమిళ సాహిత్యంలో ఆయన ఆలోచన, ఊహ, పద్యంలోని పటుత్వం కొత్తపుంతలు తొక్కాయి. వేలాది కవితలు... భారత జాతీయ గీతాలు, ప్రణయ గీతాలు, బాలల కవితలు, ప్రకృతి గీతాలు, తమిళ భాష గొప్పతనాన్ని ఉగ్గడించే కవితలు, భారత స్వాతంత్ర్య పోరాట ప్రముఖులైన తిలక్, గాంధీ, లజపతిరాయ్ వంటివారిని ప్రస్తుతించే కవితలు వంటి విస్తారమైన, విభిన్నమైన అంశాలను స్వీకరించి అద్భుతమైన రీతిలో రాశారు. శక్తి, కాళి, వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు, శివుడు, కృష్ణుడు వంటి వారినే కాక ఇతర మతదేవతలైన అల్లా, ఏసు వంటివారిని కూడా ప్రస్తుతించారు. జాతీయ, సంస్కరణ నాయకులైన అరబిందో, బాలగంగాధర తిలక్, స్వామి వివేకానంద వంటివారి ప్రసంగాలను అనువదించారు. చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి' (1882 డిసెంబరు 11 -- 1921 సెప్టెంబరు 12) తమిళ రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. ఆధునిక తమిళ కవిత్వానికి మార్గదర్శిగానూ, "మహాకవి భారతి"గానూ సుప్రసిద్ధుడు, తమిళ సాహిత్య ప్రముఖుల్లో అత్యున్నత వ్యక్తిగా పేరొందారు. ఆయన అసంఖ్యాక రచనలు భారత స్వాతంత్ర ఉద్యమ కాలంలో దేశభక్తి, జాతీయత వంటి భావాలను వెలుగొందేలా చేశాయి. భారతి చిన్నసామి సుబ్రహ్మణ్య అయ్యర్, లక్ష్మీ అమ్మాళ్ దంపతులకు సుబ్బయ్యగా 11 డిసెంబర్ 1882 లో డిసెంబర్ 11న ఎట్టయపురం గ్రామంలో జన్మించారు. తిరునల్వేలిలోని ఎం.డి.టి. హిందూ కళాశాల అన్న స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. యుక్త వయసు నుంచి సంగీతం అభ్యసించడం, 11వ యేటనే కవితలల్లడం నేర్చారు. విద్యలకు అధిదేవత అయిన సరస్వతీ దేవి పేరిట "భారతి" అన్న బిరుదాన్ని ఆ సమయంలోనే ఆయన పొందారు. విశేషమైన పట్టుదల, కృషితో ఆయన 32 భాషలు (29 భారతీయ భాషలు, 3 విదేశీ భాషలు) నేర్చుకున్నారు. స్త్రీలు రాజకీయాల్లో భాగస్వాములు కావాలని ప్రబోధిస్తూ, ఉద్యమించిన వారిలో తొట్టతొలి సంస్కర్తగా భారతిని భావిస్తారు. భారతి స్త్రీల హక్కుల గురించి, వారి విద్య గురించి విస్తృత స్థాయిలో ఆలోచించారు. స్త్రీ పురుషులు ఇద్దరూ సమానులేనని భావిస్తే ప్రపంచం వైజ్ఞానికంగా, మేధాపరంగా సమున్నతంగా విలసిల్లుతుందని భారతి భావించారు. స్త్రీల హక్కులకు భంగం కలిగించేలా మాట్లాడిన శాస్త్రాలను, ఆచారాలను ఆయన ఖండించారు. ఆయన భావాల్లో చాలావరకూ ఆధునిక కాలానికి కూడా సమకాలీనంగా నిలవడం విశేషం హిందూ సమాజంలోని కుల వ్యవస్థకు కూడా భారతి వ్యతిరేకంగా పోరాడారు. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా తన కుల గుర్తింపును విడిచి పెట్టేశారు. జీవించే ప్రతి జీవం సమానమేనని భావించారు. దీన్ని చూపించేందుకు ఒక యువ దళితునికి ఉపనయనం చేసి బ్రాహ్మణుని చేశారు. అప్పట్లో తర్వాతి తరాల వారి మనస్సులోకి పెద్దలు విభజన బీజాలు నాటడాన్ని వెక్కిరించారు. వేదాలను, గీతను బోధించేప్పుడు తమ స్వంత ఆలోచనలు దానిలో చేర్చి కువ్యాఖ్యానాలు చేయడాన్ని బహిరంగంగా ఖండించారు. దళితులను హిందూ ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావడానికి ఆయన గట్టిగా మద్దతిచ్చారు. తమిళనాట సుబ్రహ్మణ్య భారతి భావాత్మక విప్లవాన్ని సాధించారు. సంస్కరణ, దేశభక్తి, జాతీయ వాదం, తమిళ భాష ఔన్నత్యం వంటి అంశాల్లో ఆయన కవితలు తమిళులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. సామాన్యమైన ప్రజలు ఆయన కవితలను కంఠస్థం చేసి సందర్భానుసారం ప్రస్తావించే స్థాయికి వచ్చాయి. కోట్లాదిమంది ప్రజలు ఆయన రాసిన కవితల పంక్తులను ప్రస్తావించడం విశేషం. ప్రేమ, భక్తి, కరుణ, శాంతి, యుద్ధం వంటి సార్వజనీనమైన అంశాల్లోనూ భారతి గీతాలు సందర్భానుసారంగా ప్రజల నాలుకలపై నర్తించాయి. భారత ప్రభుత్వం, మానవ వనరుల అభివృద్ధి శాఖతో కలిసి 1987లో అత్యున్నత జాతీయ స్థాయి సుబ్రహ్మణ్య భారతి పురస్కారాన్ని నెలకొల్పి ప్రతి సంవత్సరం హిందూ సాహిత్యంపై అత్యున్నత స్థాయి రచనలు చేసిన రచయితలను సత్కరిస్తోంది. భారతీయార్ విశ్వవిద్యాలయాన్ని ఆయన పేరిట 1982లో కోయంబత్తూరులో నెలకొల్పారు. మెరీనా బీచ్ వద్ద, భారత పార్లమెంటు భవనం వద్ద భారతీయార్ విగ్రహాన్ని నెల కొల్పారు. కోయంబత్తూరు లోని భారతీయార్ రోడ్డు, న్యూఢిల్లీ లోని సుబ్రమణియం భారతి మార్గ్,ఇలా ఎన్నో రోడ్లుకు ఆయన పేరు పెట్టారు. కర్ణాటక సంగీత రంగంలో తరచుగా వినవచ్చే కృతుల్లో సుబ్రహ్మణ్య భారతి కీర్తనలు ఉన్నాయి. ఆయన రచించిన పలు కీర్తనలను పలువురు కర్ణాటక సంగీత విద్వాంసులు కచేరీల్లోనూ, రికార్డుల్లోనూ గానం చేశారు. **1921 సెప్టెంబరు 12లో అర్ధరాత్రి ఆయన మరణించారు.**




రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


# ప్రోత్సాహమే మనోధైర్యానికి మూలాధారం

## నేడు జాతీయ ప్రోత్సాహక దినోత్సవం




సెప్టెంబర్ 12న జాతీయ ప్రోత్సాహక దినోత్సవం జరుపుకోవడం వెనుక ఒక లోతైన మానవీయ భావజాలం దాగి ఉంది. మనిషి జీవనంలో విజయాలు, పరాజయాలు, ఆనందం, దుఃఖం, ఆశలు, నిరాశలు పరంపరగా ఎదు-రవుతుంటాయి. కానీ ఈ విభిన్న అనుభవాల మధ్య నిలబెట్టేది మనోధైర్యం. ఆ మనోధైర్యాన్ని నిలబెట్టే శక్తి ప్రోత్సాహమే. ఒక మనిషి మాట మరొక మనిషికి ప్రాణాధార మవుతుందని చెప్పడానికి ఇది అత్యుత్తమ ఉదాహరణ. జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మొదట అమెరికాలో 2007లో ఆవిర్భవించింది. "ప్రతి మనిషి సామర్థ్యం అపారమైందే కాని దాన్ని వెలికితీయడానికి ప్రేరణ కావాలి" అన్న ఆలోచనతో ఈ రోజు ఏర్పాటైంది. ఆలోచన ఒక దేశానికి పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12న ఈ దినాన్ని గుర్తుచేసుకుంటూ సానుకూల ఆలోచనలు పంచుకుంటున్నారు. ప్రోత్సాహం ఎందుకు అవసరమంటే, అది కేవలం ఒక శబ్దం కాదు, ఒక శక్తి. ఒక చిన్నపిల్ల తొలిసారి నడక మొదలు పెట్టినప్పుడు తల్లి చెప్పే "నీకు వస్తుంది" అన్న మాటే బలాన్నిస్తుంది. విద్యార్థి పరీక్షల భారం ఎదుర్కొన్నప్పుడు గురువు చెప్పే "నువ్వు చేయగలవు" అన్న మాటే ధైర్యాన్నిస్తుంది. క్రీడాకారుడు ఓటమి తర్వాత నిరుత్సాహానికి లోనైనప్పుడు స్నేహితుడు చెప్పే "తర్వాతి సారి నీ విజయం ఖాయం" అన్న మాటే అతనిని తిరిగి లేస్తుంది. ఈ మాటల్లో దాగి ఉన్న ప్రేరణ తోనే మనిషి అసాధ్యాన్ని సాధ్యం చేస్తాడు.



సమాజంలో ప్రోత్సాహం ఒక బంధాన్ని పెంచుతుంది. మనం ఇతరులను అభినందించినప్పుడు, ప్రోత్సహించినప్పుడు వారితో ఉన్న బంధం మరింత దృఢమవుతుంది. ఉద్యోగ స్థలంలో సహోద్యోగికి ఒక ప్రశంస, కుటుంబంలో బిడ్డకు ఒక అభినందన, స్నేహితునికి ఒక ధైర్య వాక్యం - ఇవన్నీ కలిసి ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. పరిశోధనల ప్రకారం ఉద్యోగ ప్రదేశాల్లో ప్రోత్సాహక వాతావరణం ఉంటే ఉత్పాదకత 30 శాతం పెరుగుతుందని, విద్యార్థులు 40 శాతం ఎక్కువగా ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్తారని నిర్ధారించబడింది. ఇది గణాంకాల రూపంలో ప్రోత్సాహం యొక్క శక్తిని స్పష్టంగా చూపిస్తుంది. ఈ రోజు పాటించాల్సిన విధానం చాలా సులభం. కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలి, సహోద్యోగులకు ధైర్యం చెప్పాలి, వెనుకబడిన వారికి సానుకూల మద్దతు అందించాలి. ఒక చిన్న సహాయం కూడా ఒక పెద్ద ప్రోత్సాహ మవుతుంది. ఉదాహరణకు, చదువులో ఇబ్బంది పడుతున్న విద్యార్థికి సహాయం చేయడం, బిజీగా ఉన్న స్నేహితుని పనిలో తోడ్పడడం, ఒక వృద్ధునికి ధైర్యం చెప్పడం వంటి చిన్న చర్యలు గొప్ప ఫలితాలు ఇస్తాయి. మన భారతీయ సంస్కృతిలో ప్రోత్సాహం ప్రత్యేక స్థానం కలిగి ఉంది. వేదాల్లో "మంచి మాట వంద యజ్ఞాల కంటే శ్రేష్ఠం" అని చెప్పబడింది. కవి గురజాడ అప్పారావు "దేశమంటే మట్టి కాదు, మనుషుల సమూహం" అన్నప్పుడు కూడా పరస్పర ప్రోత్సాహమే ఒక సమాజాన్ని నిర్మిస్తుందని సూచించారు. తాళ్ళపాక అన్నమయ్య, త్యాగరాజు కీర్తనల్లోనూ భక్తిని ప్రేరేపించే ఉత్సాహ వాక్యాలే ప్రధానంగా కనిపిస్తాయి. ప్రోత్సాహం ఇవ్వడం మన కర్తవ్యం మాత్రమే కాదు, మన సంస్కృతి కూడా. ఈ రోజు మనకు గుర్తుచేస్తున్నది - ప్రోత్సాహం ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక సమాజాన్నీ మార్చగలదు. ఒక చిన్న వాక్యం, ఒక ఆశాజనకమైన దృష్టి, ఒక మధురమైన అభినందన - ఇవన్నీ కలిసి నిస్సహాయుడిని స్ఫూర్తివంతుడిగా మార్చగలవు. జాతీయ ప్రోత్సాహక దినోత్సవాన్ని కేవలం ఒక రోజుకు పరిమితం చేయకుండా ప్రతీ రోజూ మనం ఆచరించాలి. మన కుటుంబం, మన స్నేహితులు, మన సహచరులు మాత్రమే కాదు, మన పరిచయం లేని వ్యక్తికైనా ఒక చిరునవ్వు, ఒక సానుకూల మాట ఇవ్వగలిగితే అదే నిజమైన ప్రోత్సాహం అవుతుంది. ప్రోత్సాహం ఇస్తే ప్రేరణ కలుగుతుంది, ప్రేరణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, ఆత్మవిశ్వాసం విజయానికి దారితీస్తుంది. ఈ శాశ్వత సత్యాన్నే సెప్టెంబర్ 12 జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మనకు గుర్తుచేస్తుంది.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


# తొలిమహిళా న్యూస్ రీడర్ ఆంధ్రా నైటింగేల్ మంగమ్మ



**జోలెపాళ్యం మంగమ్మ. అలనాటి రేడియో శ్రోతలకు సుపరిచితమైన పేరు. నేడు ఆకాశవాణి ప్రపంచము లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. భారత ప్రభుత్వ సమాచార , ప్రసార మంత్రిత్వశాఖ అధ్వర్యములో పని చేస్తుంది. రేడియో వార్తలు నిబద్ధతకు, విశ్వసనీయతకు తొలినాళ్ళ నుండి పేరు పొందాయి. సమాచార వ్యవస్థ పటిష్ఠంగా లేని రోజుల్లో రేడియో వార్తల కోసం జనం ఆసక్తిగా ఎదిరి చూసే వారు.**

## నేడు జోలెపాళ్యం మంగమ్మ జయంతి

ఒకప్పుడు రేడియో మాత్రమే ఒక సమాచార సాధనంగా ఉన్న పాతకాలపు మరచి పోలేని రోజులలో, ప్రజలకు వార్తలు ఎప్పటికప్పుడు తెలియచేస్తూ ప్రజలలో ఒకరిగా, అందరికీ ఆత్మీయులుగా వార్తా చదువరులు తమ తమ శైలులలో సుస్థిర స్థానం సంపాయించు కొన్నారు. ఆకాశవాణిలో వార్తా చదువరులుగా (చీజుఔా =జూాణజు=ా), ఎంతగానో ప్రాచుర్యం పొందిన వారిలో న్యూస్ రీడర్సుది ప్రథమ స్థానం. ఆ విధంగా తెలుగులో ఇటు ప్రాంతీయ కేంద్రాలైన విజయవాడ, హైద్రాబాదు నుండి వచ్చే ప్రాంతీయ వార్తలు, అటు హస్తిన నుండి వచ్చే జాతీయ వార్తలు ప్రజలకు కావలిసిన విశేషాలను నిర్ణీత సమయ సారిణి ప్రకారం తెలియ చెప్పేవి.

ఆ రోజుల్లో ఢిల్లీ నుంచి తెలుగు వార్తలు చదివే ఒక్కొక్కరిదీ ఒక్కొక్క బాణీ. ఎవరి స్టైల్ వారిదే. ప్రముఖ సినీ నటుడు కొంగర జగ్గయ్య,కపిల, కాశీపతి, శ్రీ వాత్సవ, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, పన్యాల రంగనాధరావు, వనమాలి ప్రసాద్, జోళిపాళ మంగమ్మ, కందుకూరి సూర్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీరాములు, అద్దంకి మన్నార్, వావిలాల రాజ్యలక్ష్మి, దుగ్గిరాల పూర్ణయ్య, ఏడిద గోపాలరావు వార్తలు చదవడంతో తెలుగువారి హృదయాలకు సన్నిహితులయ్యారు. ఇలా ఎందరో మహానుభావులు. ఎవరికి ఎవరు తీసిపోరు. వార్తలు మధ్య నుంచి విన్నా చదువు తున్నది పలానా అని చెప్ప గలిగేలా తమదయిన తరహాలో వార్తలు చదివే వాళ్ళు.



ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో తెలుగు న్యూస్ రీడర్‌గా, ఢిల్లీ తెలుగు న్యూస్ విభాగంలో దశాబ్ద కాలానికి పైగా సేవలందించిన మంగమ్మ తెలుగు రేడియో శ్రోతలకు చిర పరిచయస్థురాలు. "ఆకాశవాణి.. వార్తలు చదువుతున్నది జోలిపాళ్యం మంగమ్మ" అంటూ తెలుగు శ్రోతలకు వార్తలు వినిపించిన చిరపరిచిత స్వరం ఆమెది. జోలిపాళ్యం మంగమ్మతో పాటు , విభాగ అధిపతి దుగ్గిరాల పూర్ణయ్య, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మీ, కందుకూరి సూర్యనారాయణ, ఏడిద గోపాలరావు, అద్దంకి మన్నార్ తదితరులు ఆమె సహచరులు.

జోలెపాళ్యం మంగమ్మ తెలుగు రచయిత్రి, రేడియో వార్తా చదువరి. మంగమ్మ ఆల్ ఇండియా రేడియోలో మొట్టమొదటి మహిళా న్యూస్ రీడర్‌గా ప్రసిద్ధురాలుగా పేరెన్నిక గన్నారు .

ఆమె చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1925, సెప్టెంబరు 12న జన్మించారు. ఎం.ఎ., బి.ఎడ్ చదివారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈమెకు తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచ్, ఎస్పరాంటో, తమిళ, హిందీ భాషలలో ప్రావీణ్యం ఉంది. ఈమె ఆలిండియా రేడియో న్యూఢిల్లీలో 10 సంవత్సరాలు ఎడిటర్‌గా, న్యూస్ రీడర్‌గా విధులు నిర్వర్తించారు. 1962 నుండి నేషనల్ ఆర్కీవ్స్, ఢిల్లీలో పరిశోధనలు చేశారు. బోధనా రంగంలో సుమారు పాతిక సంవత్సరాల అనుభవం సంపాదించారు. ఈమె కేంద్ర సమాచార శాఖ, విదేశాంగ శాఖలలో కీలకమైన పదవులను నిర్వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొదలైన సంస్థలలో జీవిత సభ్యురాలు. ఇంకా ఈమె అనిబీసెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యక్షురాలిగా, గాంధీ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అధ్యక్షురాలిగా, లోక్ అదాలత్‌లో సభ్యురాలిగా వివిధ హోదాల్లో సేవలను అందించారు. ఆమె ఇంగ్లీషు, తెలుగు భాషలలో పలు పుస్తకాలను రచించారు. న్యూఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారం, సిద్ధార్థ కళాపీఠం (విజయవాడ) విశిష్ట అవార్డు మొదలైన సత్కారాలను పొందింది. సరోజినీ నాయుడు అనుయాయిగా ఈమె పేరు గడించారు. "ఆంధ్రానైటింగేల్" అనే బిరుదును పొందారు.



తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు (1746-1856), ఆంధ్రదేశంలో క్రైస్తవ మిషనరీల సేవ, ఇండియన్ పార్లమెంట్, శ్రీ అరబిందో, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, అనిబీసెంట్ పుస్తకాలను ఆమె తెలుగులో వెలువరించారు. అలాగే ప్రింటింగ్ ఇండియా, అల్లూరి సీతా రామరాజు, లాస్ట్ పాలెగార్ ఎన్‌కౌంటర్ విత్ ది బ్రిటిష్ ఇన్ ది సీడెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1846-1847, ది రేట్ స్కూల్స్ ఆఫ్ గోదావరి పుస్తకాలను ఆంగ్లంలో రచించారు. మదనపల్లెలోని తన స్వగృహంలో 2017, ఫిబ్రవరి 1వ తేదీన తన 92వ యేట వృద్ధాప్య సమస్యలతో మరణించారు.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చురకలు





# యూఎస్ ఓపెన్ ఫైనల్లో రిబకినా వర్సెస్ సబలెంకా

**న్యూయార్క్, సెప్టెంబర్ 11 (చురకలు):** యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో శనివారం జరగనున్న ఫైనల్ పోరు అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ అరినా సబలెంకాతో రెండో సీడ్ ఎలెనా రిబకినా టైటిల్ సమరంలో తలపడనుంది. గురువారం రాత్రి జరిగిన తీవ్ర సంచలనాత్మక సెమీఫైనల్ పోరులో రిబకినా 3-6, 6-4, 6-4 తేడాతో అమెరికా క్రీడాకారిణి కోకో గాఫ్‌పై విజయం సాధించి తొలిసారి యూఎస్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అరినా సబలెంకా 7-5, 6-2 స్కోరుతో జెస్సికా పెగులాను ఓడించి హ్యాట్రిక్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. ఈ ఇద్దరు దిగ్గజ ప్లేయర్లు ఫైనల్‌కు చేరుకోవడంతో యూఎస్ ఓపెన్ చరిత్రలో మరో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. 2013లో సెరెనా విలియమ్స్, విక్టోరియా అజరెంకా మధ్య జరిగిన ఫైనల్ తర్వాత, మళ్లీ 13 ఏళ్ల విరామం అనంతరం టోర్నీలోని టాప్-2 సీడ్లు ఫైనల్లో తలపడటం ఇదే తొలిసారి. ప్రదర్శనతో ఇప్పటికే డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ స్థానాన్ని ఖాయం చేసుకున్న కజకిస్థాన్ స్టార్ రిబకినా, సబలెంకాపై గెలిచి తన కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ సాధించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు వరుసగా మూడోసారి యూఎస్ ఓపెన్ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించాలని సబలెంకా భావిస్తోంది. ఆర్థర్ యాష్ స్టేడియంలో జరిగే ఈ హై-వోల్టేజ్ ఫైనల్ పోరు టెన్నిస్ ప్రియులకు అసలైన విందు అందించనుంది.



# దాయాదిపై గోల్స్ వర్షం.. భారత్ జయభేరి!

## పాకిస్థాన్‌పై 19-0తో ఘన విజయం

## క్వార్టర్స్‌లో భారత అమ్మాయిల విధ్వంసం

## 18 పెనాల్టీ కార్నర్లు గోల్స్‌గా మలిచిన భారత్

## హ్యాట్రిక్‌తో మెరిసిన పూజా మాలిక్

## పతకానికి రెండడుగుల దూరంలో భారత జట్టు

**మొఖి (చైనా), సెప్టెంబర్ 11 (చురకలు):** జూనియర్ ఆసియా కప్‌లో భారత మహిళల హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఏకంగా 19-0 గోల్స్ తేడాతో చిత్తుచేసింది. ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత అమ్మాయిలు గోల్స్ వర్షం కురిపించి పతకానికి రెండడుగుల దూరంలో నిలిచారు. పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకోవడంలో భారత్ అదరగొట్టింది. ఏకంగా 18 పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలిచి పాకిస్థాన్ రక్షణ శ్రేణిని ఉక్కిరిబిక్కిరి చేసింది. తొలి రెండు క్వార్టర్లలో ఐదేసి గోల్స్ సాధించిన భారత్.. చివరి క్వార్టర్‌లో మరో ఆరు గోల్స్‌తో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. భారత్ తరపున పూజా మాలిక్ 27, 49, 51వ నిమిషాల్లో గోల్స్ చేసి హ్యాట్రిక్‌తో మెరిసింది. రోష్ని, తనూజా, సుప్రియ, మధు, సనిక తలా రెండు గోల్స్ సాధించి భారీ విజయంలో కీలకపాత్ర పోషించారు. దాయాదిపై 19--0తో తిరుగులేని విజయాన్ని నమోదు చేసిన భారత అమ్మాయిలు జూనియర్ ఆసియా కప్‌లో తమ జోరును కొనసాగించారు.



# ఫైనల్‌కు భారత్

- సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- ఫిఫ్టీతో మెరిసిన షెఫాలి
- స్పిన్నర్ల మాయకు తోకముడిచిన బంగ్లా



**దుబాయ్, సెప్టెంబర్ 11 (చురకలు):** మహిళల ఆసియా కప్‌లో ఎనిమిదో టైటిల్‌పై కన్నేసిన భారత్.. ఆ దిశగా మరో అడుగు ముందుకేస్తూ టోర్నీ చరిత్రలో పదో సారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం ముగిసిన తొలి సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో గెలిచి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టీమిండియా నిర్దేశించిన 150 పరుగుల ఛేదనలో.. స్పిన్నర్ల ధాటికి బంగ్లా 109/7కే పరిమితమైంది. మొదట బ్యాటింగ్ చేసిన ఉమెన్ ఇన్ బ్లూ.. షెఫాలి వర్మ (40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 64) అర్ధశతకానికి తోడు హర్మన్‌ప్రీత్ కౌర్ (24 నాటౌట్), రిచా ఘోష్ (21) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 రన్స్ చేసింది. బంగ్లా తరఫున షోర్నా అక్తర్ (22), దిలారా అక్తర్ (21) టాప్ స్కోరర్లు. దీప్తి శర్మ (3/26), తెలుగమ్మాయి శ్రీచరణి (1/14), ప్రేమ (1/21) స్పిన్ మాయకు 2018 చాంపియన్లు ధాటిగా ఆడలేకపోయారు. శుక్రవారం శ్రీలంక, పాకిస్థాన్ మధ్య జరిగే రెండో సెమీస్‌లో గెలిచే విజేతతో భారత్ ఈనెల 13న జరిగే ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనుంది.

### షెఫాలి మెరుపులు

టోర్నీలో మంచి టచ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ స్మృతి మందాన (2) రెండో ఓవర్లోనే ఔటై నిరాశపరిచినా షెఫాలి మాత్రం ధాటిగా ఆడింది. వ్యక్తిగత స్కోరు 1, 11 వద్ద బంగ్లా ఫీల్డర్లు క్యాచ్‌లు జారవిడవడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడింది. సుల్తానా ఖటున్ వేసిన నాలుగో ఓవర్లో స్ట్రెయిట్, లాంగాఫ్ మీదుగా భారీ సిక్స్‌లు బాదింది. రబేయ ఓవర్లో ప్రతీక (20) సైతం బంతిని స్టాండ్స్‌లోకి పంపడంతో పవర్‌ప్లేను భారత్ 45/1తో ముగించింది. అయితే రబేయనే వేసిన పదో ఓవర్లో షాట్ ఆడబోయిన ప్రతీక.. కవర్స్‌లో దిలారా అక్తర్ చేతికి చిక్కడంతో 50 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మరుఫా 11వ ఓవర్లో రెండు బౌండరీలు కొట్టిన షెఫాలి.. ఫహిమ బౌలింగ్‌లో సింగిల్‌తో ఈ టోర్నీలో రెండో అర్ధ శతకాన్ని పూర్తిచేసింది. ఆ మరుసటి ఓవర్లో 6, 4, 4తో ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చిన ఆమె.. ఐదో బంతికి డీప్ మిడ్‌వికెట్ వద్ద ఫర్జానాకు క్యాచ్ ఇవ్వడంతో భారత్ మూడో వికెట్ కోల్పోయింది. ఆఖర్లో రిచా, హర్మన్ మెరుపులతో టీమిండియా మెరుగైన స్కోరు సాధించింది.

### స్పిన్ దెబ్బకు విలవిల్లాడి..

టీ20ల్లో రికార్డు ఛేదన (ఇప్పటివరకు బంగ్లా అత్యధిక ఛేదన శ్రీలంకపై 146)కు దిగిన నిగార్ సుల్తానా సేన.. భారత స్పిన్నర్ల మాయకు 20 ఓవర్లకు 109/7 మాత్రమే చేయగల్గింది. మొదట చరణి పవర్ ప్లే ఆఖరి ఓవర్లో జువారియ (14)ను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచింది. టీ20ల్లో ఈ ఆంధ్రా అమ్మాయికి ఇది 50వ వికెట్. 8వ ఓవర్లో బంతినందుకున్న దీప్తి.. దిలారాను వెనక్కిపంపింది. పది ఓవర్లకు ఆ జట్టు స్కోరు 46/2 మాత్రమే. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్.. బంతిని ప్రేమ, షెఫాలి, దీప్తి, చరణికే ఇవ్వడంతో బంగ్లా వేగంగా ఆడలేకపోయింది. భారీ ఆశలు పెట్టుకున్న శోభనా మోస్త్రి (18) కూడా దీప్తి 14వ ఓవర్లో వేసిన బంతికి క్లీన్‌బౌల్డ్ అవగా నిగార్(19)ను ప్రేమ ఔట్ చేసింది. లోయరార్డర్‌లో షోర్నా మెరుపులతో ఆ జట్టు వంద పరుగుల మార్కును దాటగలిగింది.

### సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లకు 149/6 (షెఫాలి 64, హర్మన్‌ప్రీత్ 24లి, సుల్తానా 2/30, రబేయ 1/22); బంగ్లాదేశ్: 20 ఓవర్లకు 109/7 (షోర్నా 22, దిలారా 21, దీప్తి 3/26, నందని 2/10)

# సీఎస్కే షేర్లపై ధోనీకి ఆసక్తి లేదట!

- వాటా కావాలని ఎప్పుడూ అడగలేదన్న ఫ్రాంచైజీ
- శ్రీనివాసన్‌తోనూ చర్చించలేదని వెల్లడి
- ధోనీ వద్ద లక్షకుపైగా షేర్లున్నాయంటున్న కథనాలు
- ప్రైవేట్‌గా కొనుగోలు చేశారంటూ ప్రచారం
- చెన్నై తదుపరి కోచ్ ఎంపికలో ధోనీ కీలకం



**చెన్నై, సెప్టెంబర్ 11 (చురకలు):** భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ భవితవ్యంపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ.. చెన్నై సూపర్ కింగ్స్‌లో ఆయన వాటా కొనుగోలు చేశారన్న ప్రచారం ఆసక్తికరంగా మారింది. ధోనీ ఫ్రాంచైజీలో షేర్లు కొనుగోలు చేశారంటూ ఇటీవల కథనాలు వెలువడగా.. సీఎస్కే వర్గాలు మాత్రం వాటిని తోసిపుచ్చాయి. ఫ్రాంచైజీలో వాటా కావాలని ధోనీ తమను ఎప్పుడూ అడగలేదని, ఈ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశాయి. ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచే చెన్నై జట్టుతో విడదీయరాని అనుబంధం ఏర్పరచుకున్న ధోనీకి ఫ్రాంచైజీలో వాటా ఉందన్న వార్తలు ఇటీవల చర్చనీయాంశమయ్యాయి. దీనిపై సీఎస్కే అధికారి ఒకరు స్పందిస్తూ.. "ఫ్రాంచైజీలో వాటా కావాలని ధోనీ ఎప్పుడూ అడగలేదు. ఈ విషయాన్ని మేం చర్చించలేదు. వాటా అంశంపై యజమాని ఎన్. శ్రీనివాసన్‌తో ధోనీ మాట్లాడినట్లు కూడా మాకు తెలియదు" అని పేర్కొన్నారు. అయితే మరోవైపు ధోనీ ఇప్పటికే సీఎస్కే షేర్లు కొనుగోలు చేశారంటూ కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. బహిరంగ మార్కెట్లో కాకుండా ప్రైవేట్ లావాదేవీల ద్వారా ఆయన షేర్లు కొనుగోలు చేసి ఉండొచ్చన్న ప్రచారం సాగుతోంది. సీఎస్కే కంపెనీ స్టాక్ మార్కెట్‌లో నమోదుకాకపోవడంతో ఈ షేర్ల కొనుగోలు ప్రైవేట్‌గా జరిగి ఉండవచ్చని సమాచారం.

### ధోనీ వద్ద లక్షకుపైగా షేర్లు?

'క్రిక్‌బజ్' కథనం ప్రకారం ధోనీ వద్ద లక్షకుపైగా సీఎస్కే షేర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం వాటాదారులతో పోలిస్తే ధోనీ వద్ద ఉన్న షేర్ల సంఖ్య చాలా తక్కువేనని పేర్కొంది. ప్రస్తుతం సీఎస్కే షేర్ల విలువ రూ.37.94 కోట్లుగా ఉన్నట్లు కథనాల్లో పేర్కొన్నారు. అయితే ధోనీ షేర్ల కొనుగోలుపై ఫ్రాంచైజీ అధికారిక వర్గాల ప్రకటనకు, వెలువడుతున్న కథనాలకు మధ్య భిన్నమైన సమాచారం ఉండటంతో ఈ అంశంపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ధోనీ ఈ నెలాఖరులో స్వదేశానికి తిరిగి రానున్నట్లు సమాచారం. అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి కోచ్ ఎంపికపై ఫ్రాంచైజీ యాజమాన్యంతో ఆయన చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆటగాడిగా ధోనీ భవిష్యత్తుతోపాటు సీఎస్కేలో ఆయన తదుపరి పాత్ర ఏమిటన్నదీ ఆసక్తికరంగా మారింది.

# షఫాలీపై కవ్వింపు సైగలు

- ఫాతిమా సనాపై ఐసీసీ కొరడా!
- పాక్ కెప్టెన్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా
- ఖాతాలో మరో డీమెరిట్ పాయింట్
- రెండేళ్లలో రెండో తప్పిదం
- భారత్‌తో మ్యాచ్‌లో ప్రవర్తనపై చర్య
- 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తుచేసిన భారత్



**దుబాయ్, సెప్టెంబర్ 11 (చురకలు):** ఆసియా కప్-2026లో భారత్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో భారత ఓపెనర్ షఫాలీ వర్మను ఉద్దేశించి దూకుడుగా, కవ్వించేలా వ్యవహరించిన పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ ఫాతిమా సనాపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్-1 నిబంధన, ఆర్టికల్ 2.5ను ఉల్లంఘించినందుకు ఆమె మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతోపాటు ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను జత చేసింది. శనివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ లక్ష్యఛేదనకు దిగింది. రెండో ఓవర్ చివరి బంతికి షఫాలీ వర్మను కాట్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేసిన ఫాతిమా.. ఆ తర్వాత పెవిలియన్ వైపు వెళ్లాలంటూ దూకుడుగా సైగలు చేసింది. ప్రత్యర్థి బ్యాటర్‌ను రెచ్చగొట్టేలా ఉన్న ఈ చర్యను ఐసీసీ నిబంధనల ఉల్లంఘనగా పరిగణించింది. గత 24 నెలల్లో ఫాతిమా సనా చేసిన రెండో తప్పిదం ఇదే కావడంతో ఆమె ఖాతాలో డీమెరిట్ పాయింట్ల సంఖ్య రెండుకు చేరింది. ఆన్‌ఫీల్డ్ అంపైర్ల ఫిర్యాదు మేరకు ఎమిరేట్స్ ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ మ్యాచ్ రిఫరీ సుప్రియా రాణి దాస్ ఈ శిక్షను ప్రతిపాదించారు. ఫాతిమా తన తప్పిదాన్ని అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకపోయిందని ఐసీసీ వెల్లడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ కేవలం 55 పరుగులకే ఆలౌటైంది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత మహిళల జట్టు 9 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



# జూ. ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం

ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మిప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది. తన దృష్టిలో మైకేల్ జాక్సన్ కన్నా తారక్ బెస్ట్ డాన్సర్ అని రంభ ప్రశంసలతో ముంచెత్తింది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రంభ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో సినిమా చేయాలనే తన కోరికను కూడా బయటపెట్టింది.

# నేడు 'ఆదర్శ కుటుంబం' టీజర్ విడుదల




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# మహిళలే తాళి ఎందుకు ధరించాలి?

ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహ సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. 'ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.' అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'సొంతం' సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.






# విభిన్న పాత్రలను ఎంచుకుంటా

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com